


అక్కయ్యపాలెం సమీపంలో జాతీయ రహదారిపై నిలిచిన నీరు



ఈదురుగాలుల బీభత్సం

- గంట వ్యవధిలో నగర పరిసరాల్లో రెండు వేలకుపైగా మెరుపులు
- ఉదయం నుంచి మండిన నగరం
- ఎండ, వేడిగాలులు, ఉక్కపోత

విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో శనివారం సాయంత్రం సుమారు గంటపాటు ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గంటకు 55 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలుల ధాటికి పలుచోట్ల చెట్లు, హోర్డింగ్‌లు నేలకొరిగాయి. గాలుల తీవ్రతకు విద్యుత్ సరఫరా నిలిచిపోగా, రోడ్లపై వాహన రాకపోకలు ఆగిపోయాయి. ఒక్కసారిగా పెనుగాలులు వీయడంతో ఆరుబయట ఉన్న వారంతా సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. ఈదురుగాలులతో వర్షం కూడా కురిసింది. సాయంత్రం ఐదు నుంచి ఆరు గంటల వరకు విశాఖ పరిసరాల్లో రెండు వేలకుపైగా మెరుపులు సంభవించినట్టు భారత భూవిజ్ఞాన మంత్రిత్వశాఖకు చెందిన 'దామిని' యాప్‌లో నమోదైంది. కాగా ఉదయం నుంచి తీవ్రమైన ఎండ, ఉక్కపోత ఉన్నాయి. వేడిగాలులు వీయడంతో నగరం నిప్పులకొలిమిలా మారింది. ఎయిర్‌పోర్టులో 39.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాధారణంగా జూన్ నెలలో 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదుకావడం అరుదుగా జరుగుతుందని వాతావరణ నిపుణులు తెలిపారు.



గురుద్వార్ నుంచి సత్యం జంక్షన్‌కు వెళ్లే దారిలో విరిగిన చెట్టుకొమ్మ



సత్యం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై వర్షం

తీరు మార్చుకోరా!?

- వైసీపీ పెద్దలపై నగర నేతలు, కార్పొరేటర్ల అసంతృప్తి
- ఓటమికి గల కారణాలను గుర్తించకుండా ఐదేళ్ల తరువాత అధికారంలోకి వస్తామంటూ ప్రకటనలు చేయడంపై అసహనం
- రెండు రోజుల క్రితం సుబ్బారెడ్డి నిర్వహించిన సమావేశానికి 15 మంది కార్పొరేటర్లు గైర్హాజరు?
- పార్టీ వీడే యోచనలో పలువురు...



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల్లో ఘోర పరాజయానికి గల కారణాలేమిటో తెలుసు కునేందుకు యత్నించకుండా ఇప్పటికీ 40 శాతం ఓటర్ల మద్దతు మనకే ఉందని, మళ్లీ అధికారంలోకి వస్తామని పార్టీ పెద్దలు చెబుతుండడం పట్ల వైసీపీ నేతలు, కార్పొరేటర్లు అసహనం చేస్తున్నారు. తమ వ్యవహారశైలి, నిరంకుశత్వం వల్లే పార్టీ ఓడిపోయిందనే స్పృహ లేకుండా ఇప్పటికీ ఎదుటి వారిని నిందించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ఇటీవల జరిగిన ఎన్నికల్లో నగర పరిధిలోని ఏడు నియోజక వర్గాల్లో కూటమి అభ్యర్థులే గెలుపొందారు. వైసీపీకి ఒక్క సీటు కూడా దక్కలేదు. ఈ నేపథ్యంలో వైసీపీ ఉత్తరాంధ్ర ... మిగతా 4వ పేజీలో

'జగనన్నకు చెబుదాం' పేరు మార్పు

- ఇకపై ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ
- ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం ఫొటో ఏర్పాటుకు ఆదేశాలు

విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): 'స్పందన' పేరు మార్చారు. ప్రతి సోమవారం ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల నుంచి 'స్పందన' పేరిట వినతులు స్వీకరిస్తుంటారు. దీనిని గత ఏడాది ప్రారంభంలో 'జగనన్నకు చెబుదాం'గా మార్చారు. అయితే ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఇకపై ఈ కార్యక్రమాన్ని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్)గా వ్యవహరించనున్నారు. కాగా ఈ నెల 17న సోమవారం బక్రీద్ సెలవు కావడంతో ప్రజల నుంచి వినతులు స్వీకరించరు.

ఇదిలావుండగా కలెక్టర్ ఛాంబర్ నుంచి ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటం ఏర్పాటుచేయాలని ఉన్నతస్థాయి నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు కలెక్టర్ ఛాంబర్‌లో ముఖ్యమంత్రి ఫొటో ఏర్పాటుచేశారు. మిగిలిన కార్యాలయాల్లో కూడా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి.

టీడీఆర్‌లపై కూటమి దృష్టి

గత ఐదేళ్లలో జీవీఎంసీ జారీచేసిన టీడీఆర్‌ల వివరాలు సేకరణ

- దశాబ్దాల కిందట ప్రభుత్వానికి/నగర పాలక సంస్థకు దఖలు పడిన భూములకు వైసీపీ హయాంలో టీడీఆర్‌లు
- వందల కోట్ల రూపాయల విలువైన బాండ్లు జారీ
- విచారణ కోరాలని నిర్ణయించిన తెలుగుదేశం, జనసేన నేతలు
- అధికారుల్లో గుబులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలను తవ్వి తీయాలని కూటమి నేతలు నిర్ణయించారు. నగరంలో ముఖ్యంగా జీవీఎంసీ అధికారులను గుప్పిట్లో పెట్టుకుని అడ్డగోలుగా రూ.వేల కోట్ల విలువైన టీడీఆర్‌లను కొల్లగొట్టారనే ఆరోపణలు ఉన్నాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో టీడీఆర్ జారీలో అక్రమాలను వెలికితీయించే పనిలో ఉన్నారు. ఈ పరిణామం జీవీఎంసీ అధికారుల్లో గుబులు పుట్టిస్తోంది.

విశాఖలో వైసీపీ నేతలు ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్ (టీడీఆర్) పేరుతో పెద్దఎత్తున దందాకు పాల్పడ్డారు. ఎప్పుడో దశాబ్దాల కిందట సేకరించిన భూములకు కొన్నినెలల కిందట టీడీఆర్ తీసుకున్నారు. వీటన్నింటికీ కొందరు అధికారుల సహకారం ఉందని తెలుగుదేశం, జనసేన ఎప్పటినుంచో ఆరోపిస్తున్నాయి. సిరిపురం కూడలిలో జీవీఎంసీ కమిషనర్ బంగ్లాకు ఆనుకుని ఉన్న సీబీసీఎన్‌సీ స్థలంపై చాలాకాలం వివాదం నడిచింది. ఆ స్థలాన్ని వైసీపీ నేత ఒకరు డెవలప్‌మెంట్‌కు తీసుకున్నారు. దానిని అనుకుని ఉన్న రోడ్డును భవిష్యత్తులో విస్తరించాల్సి ఉంది కాబట్టి, ఆ మేరకు స్థలాన్ని విడిచిపెట్టి నిర్మాణం చేసుకుంటున్నామని చెప్పి జీవీఎంసీకి ప్లాన్ పెట్టారు. రోడ్డు విస్తరణ జరగకపోయినప్పటికీ ఆగమేఘాల మీద రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ (ఆర్‌డీపీ) చేయించి, రూ.63 కోట్ల విలువైన టీడీఆర్‌ను జీవీఎంసీ అధికారులు జారీచేశారు. అలాగే మధురవాడలో జాతీయ రహదారి నుంచి రేవళ్లపాలెం మీదుగా నవోదయ పాఠశాలకు వెళ్లే రోడ్డును పదేళ్ల కిందట నిర్మించారు. ఆ రోడ్డు నిర్మాణంలో తమ భూమి పోయిందంటూ పూసపాటి లక్ష్మీనరసింహరాజు కుమారుడు జగన్నాథదేవవర్మ గత ఏడాది సెప్టెంబరు 16న జీవీఎంసీకి గిఫ్ట్ డీడ్ ఇవ్వగా, దాని



ఆధారంగా అధికారులు రెండు రోజుల్లోనే రూ.120 కోట్ల విలువైన టీడీఆర్‌ను జారీచేయడం జరిగిపోయింది. టీడీఆర్ జారీ అయిన రోజే రాయలసీమకు చెందిన ప్రజా ప్రతినిధి ఆ టీడీఆర్ హక్కులను జగన్నాథదేవవర్మ నుంచి బదలాయించుకున్నట్టు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అంతేగాకుండా ఆ భూమి విలువ తక్కువగా చూపడం వల్ల రూ.120 కోట్లు విలువైన టీడీఆర్ ఇచ్చారని, అక్కడ భూమి విలువ గజానికి రూ.25 వేలు అధికమని చూపిస్తూ మరోసారి జీవీఎంసీకి సవరణ గిఫ్ట్ డీడ్ ఇచ్చారు. అలా అదనంగా మరో రూ.86 కోట్లు మొత్తం రూ.206 కోట్లు టీడీఆర్‌ను గుంజేశారు. ఎప్పుడో పదేళ్ల కిందట నిర్మించిన రోడ్డులో తమ భూమి పోయిందంటూ భూ యజమాని వారసుడు పేరుతో టీడీఆర్ కోసం జీవీఎంసీకి దరఖాస్తు చేయడం, రెండు రోజుల్లో వెనుకాముందు చూడకుండా రూ.206 కోట్ల విలువైన బాండ్ అధికారులు జారీచేయడంపై ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనివెనుక వైసీపీ నేతలు చక్రం తిప్పారంటూ అప్పట్లోనే జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ ఆందోళన నిర్వహించారు.

పెదజాలారిపేట గ్రామం ఉన్న భూమి దసపల్లా రాణి వారసులకు చెందినదని పేర్కొంటూ ఆ భూమికి టీడీఆర్ కొట్టేసేందుకు వైసీపీ నేతలు స్కెచ్ వేశారు. అందుకోసం రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు గ్రామాన్ని సర్వే చేశారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకురావడంతో టీడీఆర్ జారీ ప్రక్రియ అక్కడితో ఆగిపోయింది.

అలాగే బిలాల్ కాలనీ ఉన్న భూమి కూడా ప్రైవేటుదేనని, దానికి కూడా టీడీఆర్ తీసుకునేందుకు వైసీపీ నేతలు ప్రయత్నించారు. వైసీపీకి చెందిన ఒక ప్రజా ప్రతినిధి కనుసన్నల్లో దీనికోసం కసరత్తు జరిగింది. అందుకు స్థానికంగా ఉన్న వైసీపీ నేత అడ్డుపడడంతో వైసీపీ ముఖ్య నేతల ద్వారా ఆయన్ను అదుపుచేసి టీడీఆర్ ప్రక్రియకు అడ్డుపడకుండా చేశారు. అయితే టీడీఆర్ జారీ ప్రక్రియ చివరి దశకు చేరుకునే సమయానికి విషయం బయటకు పొక్కడంతో విపక్షాలు ఆందోళనకు దిగాయి. దీంతో టీడీఆర్ జారీ ఆగిపోయింది. వెంకటపతిరాజునగర్ ... మిగతా 4వ పేజీలో

జాడ లేని క్రూయిజ్ నౌకలు

రూ.100 కోట్లతో టెర్మినల్ నిర్మాణం

- తొమ్మిది నెలల క్రితం ప్రారంభం
- ఇప్పటివరకూ ఒక్కటీ రాలేదు
- ఎవరికీ పట్టని పర్యాటకం

పోర్టు క్రూయిజ్ టెర్మినల్ భవనం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'అంతన్నారు... ఇంతన్నారోయ్.. గంగరాజు' అన్నట్టుగా మారింది విశాఖపట్నం పోర్టు క్రూయిజ్ టెర్మినల్ తీరు. ఎటువంటి వసతులు లేనప్పుడే టూర్ ఆపరేటర్లు చొరవ తీసుకుని క్రూయిజ్ నౌకను విశాఖపట్నం తీసుకువచ్చారు. చెన్నై నుంచి విశాఖ మీదుగా పాండిచ్చేరికి వారానికి రెండు రోజులు చొప్పున మూడు నెలలు నడిపించారు. ఇదంతా 2022లో జరిగింది.

పర్యాటక అభివృద్ధికి సహకరిస్తామంటూ కేంద్రం ముందుకురావడంతో నౌకాయాన శాఖ, పర్యాటక శాఖ కలిపి విశాఖపట్నం పోర్టులో రూ.100 కోట్ల క్రూయిజ్ టెర్మినల్ నిర్మించాయి. దీనికే ఆపసోపాలు పడ్డారు. ఎట్టకేలకు గత ఏడాది సెప్టెంబరు 5వ తేదీన ప్రారంభించారు. టెర్మినల్ రెడీ చేశాం కాబట్టి క్రూయిజ్ నౌకలు వచ్చేస్తాయని అనుకున్నారు. కానీ ఇది మార్కెటింగ్ ప్రపంచం. మన ప్రత్యేకతలు, అందించే వసతి సౌకర్యాలు వివరించి చెప్పకపోతే ఎవరూ ముఖం చూసే పరిస్థితి లేదు. పైగా క్రూయిజ్ నౌకలను నడిపే సంస్థలన్నీ అంతర్జాతీయ స్థాయివి. ప్రత్యేకంగా రోడ్ షోలు నిర్వహించి, విశాఖపట్నం టెర్మినల్ ప్రత్యేకత, ఇక్కడి డిమాండ్ చెబితే తప్ప ఎవరూ రారు. దీనికి అన్ని వర్గాలు (పోర్టు, కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖలు, టూర్ ఆపరేటర్లు) కలిసి రోడ్ షోలు నిర్వహించాల్సి ఉంది. ఇప్పటివరకూ అలాంటి ప్రయత్నం చేయలేదు.

ఎంఓయూ ఏమైందో?

గత ఏడాది అక్టోబరు 23న ముంబైలో జరిగిన మేరీటైమ్ సదస్సులో సింగపూర్‌కు చెందిన ఓ క్రూయిజ్ సంస్థతో ఎంఓయూ చేసుకుంటున్నామని, సింగపూర్ నుంచి చెన్నై మీదుగా విశాఖపట్నం ఓ క్రూయిజ్ వచ్చే ... మిగతా 4వ పేజీలో

ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీ?

జిల్లాలో పలువురికి స్థాన చలనం

- జాబితాలో కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్, జీవీఎంసీ కమిషనర్...
- డీఐజీ కూడా...?
- విశాఖ వచ్చేందుకు పలువురి పోటీ



మల్లికార్జున



రవిశంకర్ అయ్యానార్



సాయికాంత్‌వర్మ

విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వం మారిన నేపథ్యంలో రెండు, మూడు రోజుల్లో ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు ఉండవచ్చునంటున్నారు. విశాఖ జిల్లా వరకూ చూస్తే కలెక్టర్, జాయింట్ కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్, జీవీఎంసీ కమిషనర్ పోస్టులు అత్యంత ప్రాధాన్యం కలిగినవి. వీరిలో జాయింట్ కలెక్టర్ మినహా మిగిలిన వారి బదిలీ ఖాయమని జోరుగా ప్రచారం జరుగుతోంది.

జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ ఎ.మల్లికార్జున వచ్చి దాదాపు మూడేళ్లయింది. ఆయన ఉమ్మడి జిల్లా కలెక్టర్‌గా 2021 జూలై 28న బాధ్యతలు తీసుకున్నారు. జిల్లాల విభజన తరువాత ఆయన విశాఖ జిల్లా కలెక్టర్‌గా కొనసాగుతున్నారు. దాంతోపాటు అదనంగా వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కడప జిల్లాకు చెందిన మల్లికార్జున మూడేళ్లపాటు కలెక్టర్‌గా కొనసాగడానికి ప్రభుత్వ పెద్దల ఆశీస్సులు కారణమనే వాదన ఉంది. ఈ నేపథ్యంలో ఆయన బదిలీ ఖాయమంటున్నారు. రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన జిల్లా కావడంతో సమర్థుడైన అధికారికి అవకాశం ఇస్తారని ఉన్నత స్థాయి వర్గాల్లో చర్చ సాగుతుంది. ఇక నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ 1994వ బ్యాచ్ అధికారి. అడిషనల్ డీజీ హోదాలో ఉన్న రవిశంకర్‌కు రాష్ట్రస్థాయిలో మరో పదవి ఇచ్చి విశాఖకు మరొకరిని ... మిగతా 4వ పేజీలో

మహా దుబారా

కూడళ్ల అభివృద్ధి పేరుతో విచ్చలవిడిగా ఖర్చు

- ఆరు నెలలకు ఒకసారి జంక్షన్లలో బొమ్మలు మార్పు
- రూ.కోట్లలో ప్రజాధనం వృథా

విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కూడళ్ల అభివృద్ధి పేరుతో జీవీఎంసీ అధికారులు ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగర సుందరీకరణ అంటూ అధికారులు ప్రతి కూడలిలోనూ వాటర్ ఫౌంటెయిన్, ఆకట్టుకునే విగ్రహాలు, సృజనాత్మకత జోడించిన అందమైన బొమ్మలను ఏర్పాటుచేస్తున్నారు. ఇందుకోసం ఒక్కో కూడలికి రూ.పది లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ ఖర్చు చేస్తున్నారు. అయితే చాలా కూడళ్లలో ఏర్పాటుచేసిన బొమ్మలను రెండు, మూడు నెలలు తిరిగేసరికి తొలగించి రోడ్డుపక్కన పడేస్తున్నారు. తిరిగి వాటి స్థానంలో కొత్త డిజైన్లతో బొమ్మలు, విగ్రహాలు ఏర్పాటుచేస్తున్నారు. ఎండాడ కూడలిలో కొన్నాళ్ల కిందట శిశువును ఒడిలో పెట్టుకున్న తల్లి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. నెల రోజులు కూడా గడవకుండానే ఆ విగ్రహాన్ని తొలగించి వాటర్ ఫౌంటెయిన్‌తోపాటు ఎండాడ జంక్షన్ బోర్డు ఏర్పాటుచేశారు. తాజాగా పాత డెయిరీ ఫారం జంక్షన్‌లో వాటర్ ఫౌంటెయిన్, మధ్యలో పడవలో జాలార్లు చేపలను వేటాడుతున్నట్టుండే బొమ్మను జీవీఎంసీ అధికారులు తొలగించారు. దీనిని గత ఏడాది డిసెంబరు నెల చివర్లో దాదాపు రూ.15 లక్షలు ఖర్చు చేసి ఏర్పాటుచేశారు. ఆరు నెలలు కూడా గడవకుండానే ఆ విగ్రహాన్ని తొలగించారు. ఆ స్థానంలో నాటు బండి బొమ్మను ఏర్పాటుచేశారు. జంక్షన్ల అభివృద్ధి పేరుతో రూ.లక్షలు వెచ్చించి విగ్రహాలు, వాటర్ ఫౌంటెయిన్లు ఏర్పాటుచేస్తున్న అధికారులు వాటిని ఆరు నెలలు తిరగకుండానే తొలగించడం, మళ్లీ రూ.లక్షలు వెచ్చించి అక్కడ కొత్తవాటిని ఏర్పాటుచేస్తుండడం విమర్శలకు తావిస్తున్నది. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని కొందరు, కమీషన్ల కోసం తరచూ జంక్షన్లలో బొమ్మలను మార్చేస్తున్నారని మరికొందరు దుయ్యబడుతున్నారు.





పాత డెయిరీఫారం జంక్షన్‌లో ఆరు నెలలు కిందట ఏర్పాటుచేసిన పడవపై మత్స్యకారులు. ఇప్పుడు అదేచోట ఏర్పాటుచేసిన ఎండ్లబండి బొమ్మ

అంగన్‌వాడీల యూనియన్ జిల్లా అధ్యక్షురాలిగా వెంకటలక్ష్మి



వెంకటలక్ష్మి

జగదాంబ కూడలి, జూన్ 15: ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) విశాఖ జిల్లా అధ్యక్షురాలిగా ఎం. వెంకటలక్ష్మి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. శనివారం జగదాంబ వద్ద సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశం లో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి సమక్షంలో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే, భీమిలి ఐసీడీ ఎస్ ప్రాజెక్టునుంచి నరసయ్యమ్మను జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అంగనవాడీ వర్కర్స్ సమస్యలపై కూటమి నూతన ప్రభు త్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవెరుస్తుందన్న ఆశాభావాన్ని రాష్ట్ర, జిల్లా నాయకులు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ యూ నియన్ గౌరవ సలహాదారు బృంద, మాజీ జిల్లా ప్ర ధాన కార్యదర్శి ఆర్. వెంకటలక్ష్మి, గౌరవ అధ్యక్షురాలు పి. మణి, ప్రధాన కార్యదర్శి ఎల్. దేవి, కార్యనిర్వాహక అధ్యక్షురాలు శోభారాణి, కోశాధికారి పద్మ పాల్గొన్నారు.

'డయల్ యువర్ సీపీ'కి 17 ఫిర్యాదులు

మహారాణిపేట, జూన్ 15: పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో శనివారం డయల్ యువర్ సీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఏ రవిశంకర్‌కు 17 మంది కాలర్స్ ఫోన్ చేసి స్వయంగా తమ సమస్యలను విన్నవించారు. కమిషనర్ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను చట్టపరంగా చర్యలు తీసుకుని పరిష్కరించాలని సూచించారు.

శ్రీశ్రీతో తెలుగు సాహిత్యానికి కొత్త మలుపు

సీతంపేట, జూన్ 15: మహాకవి శ్రీశ్రీ తెలుగు సాహిత్యానికి కొత్త ఒరవడి, కవుల్లో నవ్యరీతి ఆ లోచనా ధోరణిలను రేకెత్తించారని సాహితీవేత్తలు కొనియాడారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆచార్య చందు సుబ్బారావు సా హితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వ ర్యంలో మహాకవి శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా సాహిత్య సభను ని ర్వహించారు. ఆధునిక సాహిత్య వై తాళికుడు శ్రీశ్రీ అనే అంశంపై నిర్వహించిన ఈసదస్సుకు ట్రస్ట్ చైర్మన్, యూపీఎస్సీ పూర్వ సభ్యులు ఆచార్య కేఎస్ చలం అధ్యక్షత వహించి మాట్లాడారు. శ్రీశ్రీ కవిత్వంపై రచయిత, కవి పురిపండ అప్పలస్వామి ప్రభావం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిస్థితులను శ్రీశ్రీ ఊహించిముందే చెప్పారని, ప్రస్తుతం అవే కొనసాగుతున్నాయన్నారు. ప్రముఖ సాహితీ విమర్శకులు ఆచార్య చందు సుబ్బారావు మాట్లాడుతూ శ్రీశ్రీ కవిత్వంతో సమాజంలో గొప్ప సంస్కరణలు తెచ్చారన్నారు. సినీ రంగంలో కూడా మంచి పేరు సంపాదించారన్నారు. రాష్ట్రపతి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గరిమెళ్ల నాగేశ్వరరావు శ్రీశ్రీ అద్భుతంగా కవిత్వం రాయడానికి ఆ యన దేశీయ భాషలతో పాటు పాశ్చాత్య సాహిత్యంపైనా మంచి పట్టు ఉండడమే కారణమని అన్నారు. గరిమెళ్ల నాగేశ్వరరావుకు చంద్ర ట్రస్ట్ ప్రోత్సాహక పురస్కార ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేడా మస్తాన్ రెడ్డి, చందు సాహితీ సంస్థ కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, డాక్టర్ డీవీ సూర్యారావు, శ్యామసుందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



గరిమెళ్ల నాగేశ్వరరావుకు చంద్ర ట్రస్ట్ పురస్కారం అందిస్తున్న అతిథులు

మురళీనగర్; మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో శనివారం మహాకవి శ్రీ శ్రీ 41వ వర్ధంతి కార్యక్రమం చేపట్టారు. ముందుగా ఆయన చిత్ర పటానికి వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి, పూర్వ అధ్యక్షులు ఎన్.బుచ్చయ్య చౌదరి క్లబ్ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం క్లబ్ కార్యవర్గ సమావేశం నిర్వహించి పార్కు ఉన్నతికి తీసుకునే నిర్ణయాలను తెలిపారు.

కళలను ప్రోత్సహించాలి

▸▸ దేవదాయశాఖ సహాయ కమిషనర్ శిరీష



సాంస్కృతిక ప్రదర్శలను ప్రారంభిస్తున్న శిరీష

మురళీనగర్, జూన్ 15; భారతీయ సంగీత, నృత్య కళా రీతులు గొప్పవని, వాటిని ప్రోత్సహిస్తూ కాపాడుకోవాలని దేవదాయశాఖ సహాయ కమిషనర్ శిరీష పేర్కొన్నారు. ఆర్ అండ్‌బీ జంక్షన్ శ్రీ భూసమేత విజయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నాట్య పరిమళ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడెమీ ఆధ్వర్యంలో అష్టోత్తర శత నృత్య సంకీర్తనార్చనలో భాగంగా 34 వ ఆధ్యాత్మిక ఉత్సవం చేపట్టారు. ముఖ్య అతిథిగా పాల్గొని ఆమె మాట్లాడారు. తమ శాఖ ద్వారా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల ద్వారా కళా సంస్థలను, కళాకారులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ సభాధ్యక్షులుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాలలు 80 మంది పాల్గొన్నారు. అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేశారు. కళాకారులకు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో కళాకారుల తల్లిదండ్రులు, వేంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మొక్కలకు నీరు పెట్టడంలో అవినీతి

▸▸ విచారణ చేపట్టాలని కమిషనర్‌కు సీపీఐ విజ్ఞప్తి

జ్ఞానాపురం, జూన్ 15: జీవీఎంసీలో మొక్కలకు నీరు పోసే ట్రిప్పర్లలో జరిగిన భారీ కుంభకోణంపై సమగ్రవిచారణ జరిపించి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని కోరుతూ సీపీఐ విశాఖజిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. జీవీఎంసీ పరిధిలోని 98వార్డుల్లో మొక్కలకు మంచినీటి ట్యాంకర్ల ద్వారా నీరు పోసేందుకు 11మంది గుత్తేదారులు టెండర్లు ద క్కించుకున్నారన్నారు. అయితే, ఇటీవల 2600 ట్రిప్పులు నీరుపోసినట్టు, దీనికి బిల్లులు చెల్లించాలని చెప్పి రూ. 60 లక్షలు కాజేయాలను చూడడం.. దీనికి అధికారులు సహకరించడం దుర్మార్గమని పైడిరాజు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ వ్యవహారంలో జీపీఎస్ ద్వారా చెక్ చేస్తే కేవలం 900 ట్రిప్పులు మాత్రమే బయటపడినట్టు ఆయన ఆరోపించారు. నగరప్రజలు పన్నుల రూపంలో క డుతున్న డబ్బు దోచుకుంటున్న గుత్తేదారులు, వారికి సహకరిస్తున్న జీవీ ఎంసీ అధికారులను గుర్తించి తగిన చర్యలు తీసకోవాలని ఆయన కోరారు.

ఆయుర్వేద వైద్యంతో రుగ్మతల నివారణ

మహారాణిపేట, జూన్ 15: ఆయుర్వేదం చికిత్సతో అనేక రుగ్మతలు నివారించవచ్చునని ప్రముఖ ఆయిర్వేద వైద్య నిపుణులు గౌతమ్ కృష్ణమూర్తి అన్నారు. శనివారం జిల్లా పరిషత్ పందిమెట్ట వద్ద నిర్వహించిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుర్వేద ఎప్పుడు ఎవరు కనుగొన్నారు. దీనిని ఎవరు అభివృద్ధి చేశారు అన్నదానిపై కచ్చితమైన సమాచారం లేదని, కానీ, ఈ చికిత్సలో ఎన్నో ప్రయోజనాలున్నాయన్నారు. చికిత్స సమయంలో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అనుసరించటం చాలా అవసరమని అన్నారు. ఈ కార్య క్రమంలో పలువురు పాల్గొన్నారు.

19 నుంచి ఐటీఐ ప్రవేశాలకు కౌన్సెలింగ్

కంచరపాలెం, జూన్ 15: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు ఈనెల 19వ తేదీ నుంచి నుంచి కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నారు. ఈ మేరకు కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో ఏర్పాట్లు పూర్తిచేసినట్టు అధికారులు జె. శ్రీకాంత్, వై. ఉమాశంకర్ తెలిపారు. ప్రతి రోజూ రెండు విడతల్లో ఉదయం 8గంటలకు మొదటి బ్యాచ్, మధ్యాహ్నం ఒంటిగంటకు రెండో బ్యాచ్ చొప్పున కౌన్సెలింగ్ చేయనున్నారు. ఐటీఐ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసిన వారిలో 3398 మంది అభ్యర్థులు తమ ధ్రువపత్రాలను వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయింది. ఈ అభ్యర్థులకు మాత్రమే కౌన్సెలింగ్‌నకు అనుమతిస్తారు.

11 మంది నిరాశ్రయుల గుర్తింపు



నిరాశ్రయులతో ఆర్పీఎఫ్‌లు, ఏయూటీడీ సిబ్బంది

అక్కయ్యపాలెం, జూన్ 15: రైల్వే స్టేషన్‌లో ఆర్పీఎఫ్, ఏయూటీడీ సిబ్బంది సంయుక్తంగా చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్‌లో 11 మంది నిరాశ్రయులను గుర్తించి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం కల్పించినట్టు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. వీరిలో కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో భిక్షాటన చేస్తున్న వారే అధికంగా ఉన్నారన్నారు. వీరికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్టు చెప్పారు.

నారా లోకేశ్‌కు ఏపీఆర్‌టీఈ ఫోరం శుభాకాంక్షలు

డాబాగార్డెన్స్, జూన్ 15: రాష్ట్ర మంత్రి వర్గంలో విద్యాశాఖా మంత్రిగా నియమితులైన నారా లోకేశ్‌కు ఆంధ్రప్రదేశ్ రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం తరపున రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో విద్యా హక్కు చట్టం పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోకపోవడంతో డ్రాప్‌ఔట్స్ , బాల కార్మికుల సంఖ్య ఘననీయంగా పెరిగిందన్నారు. అలాగే ప్రైవేట్ స్కూళ్లలో పేద బాలలకు 20 శాతం ఉచిత సీట్లు కేటాయించేలా చూడాలని కోరారు. లోకేశ్ సారథ్యంలో బాలల హక్కుల పరిరక్షణకు భరోసా ఉండగలదని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

అక్కయ్యపాలెం, జూనన్ 15: కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు రజతోత్సవాల్లో భాగంగా అక్కయ్యపాలెం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఆ దివారం ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నట్టు బ్యాంక్ చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు ఖాతాదారులు, శ్రేయోభిలాషులు ఈ శిబిరంలో పాల్గొని పలు వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అలాగే రక్తదానానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

స్కూల్ బస్సులు ఫిట్‌నెస్‌తో ఉండాలి: సీఐ



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ ప్రసాద్

సీతంపేట, జూన్ 15: పాఠశాలలకు విద్యార్థులను తీసుకువెళ్లే ఆటోలు, బస్సులు పూర్తి ఫిట్‌నెస్‌తో ఉండేలా చూసుకోవాలని ద్వారకా ట్రా ఫిక్ సీఐ ప్రసాద్ అన్నారు. సీతంపేట రోడ్డు ద్వారకానగర్‌లోని భాష్యం స్కూల్‌లో యాజమాన్యం, ఆటో డ్రైవర్లకు ఎస్ఐ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ప్రసాద్ మాట్లాడుతూ మితిమీరిన వే గంగా వాహనాలు నడపరాదని, పరిమితికి మించి పిల్లలను తీసుకు వెళ్లరాదన్నారు.ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

టీడీఆర్‌లపై కూటమి దృష్టి

.. 3వ పేజీ తరువాయి

భూమి కూడా ప్రైవేటుదేనని, వారసులుగా పేర్కొంటూ కొంతమందిని వైసీపీ నేతలే తెరపైకి తెచ్చారు. వైసీపీ నేతలు వెనకుండి ఆ భూమికి నాలుగు రెట్లు సుమారు రూ.వంద కోట్లు విలువైన టీడీఆర్ కొట్టేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. అలాగే దసపల్లా హిల్స్ ప్రాంతంలో సర్క్యూట్‌హౌస్ జంక్షన్ నుంచి నౌరోజీ రోడ్డు జంక్షన్ వరకూ వంద అడుగులు మాస్టర్‌ప్లాన్ రోడ్డు నిర్మాణానికి ఇటీవల జీవీఎంసీ నోటిఫికేషన్ జారీచేసింది. ఒకవేళ అంతా అనుకున్నట్టు జరిగితే నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించి కొన్నాళ్ల కిందటే ప్రైవేటు భూములుగా రికార్డుల్లో నమోదైన దసపల్లా హిల్స్ భూ యజమానులకు రోడ్డు నిర్మాణం కోసం తీసుకునే భూమికి పరిహారంగా టీడీఆర్ జారీచేయాల్సిన పరిస్థితి. అందుకు విపక్షాలు అడ్డంపడడంతో తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఈలోగా ఎన్నికలు సమీపించడంతో టీడీఆర్‌ల జారీని పక్కనపెట్టాలని వైసీపీ నేతలు జీవీఎంసీ అధికారులకు సూచించారు. మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు టీడీఆర్‌లన్నింటినీ తీసు కోవచ్చునని వైసీపీ నేతలు భావించారు.కానీఘోరపరాజయం పాలవ్వడం,కూటమి అధికారంలోకి రావడంతోవైసీపీ నేతలతోపాటు జీవీఎంసీలోని కొందరు అధికారులకు కంగు తి న్నారు. గత ప్రభుత్వంలో టీడీఆర్ పేరుతో భారీగా అక్రమాలు జరిగాయని, ఇప్పుడు వాటన్నింటినీ తవ్వితీయాలని కూటమి నేతలు భావిస్తున్నారు. ఆ మేరకు ఇప్పటికే సమాచార సేకరణలో నిమగ్నమవ్వడంతో బాధ్యులైన అధికారుల్లో గుబులు మొదలైంది.

తీరు మార్చుకోరా!?

.. 3వ పేజీ తరువాయి

సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి రెండు రోజుల క్రితం నగరంలోని ముఖ్య నేతలు, ఎన్నికల్లో ఓటమి పాలైన అభ్యర్థులతో సమావేశమయ్యారు. అనంతరం కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సుమారు 15 మంది వరకూ కార్పొరేటర్లు గైర్హాజరయ్యారు. ఎన్నికల్లో పార్టీ ఓటమికి గల కారణాలను అడిగి తెలుసుకోవడంతోపాటు ఆయన వైపు నుంచి గుర్తించిన అంశాలను తమతో పంచుకుంటారని నేతలు, కార్పొరేటర్లు భావించారు. వాటిని ఎలా అధిగమించాలనే దానిపై దిశానిర్దేశం చేస్తారని ఆశించారు. కానీ ఆయన 40 శాతం మంది మన వెంటే ఉన్నారని, తిరిగి అధికారంలోకి వస్తామంటూ మాట్లాడడం తమను ఆశ్చర్యానికి గురిచేసిందని కొంతమంది నేతలు, కార్పొరేటర్లు పేర్కొంటున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై వారం రోజులు కూడా కాకుండానే ఐదేళ్ల తర్వాత జరిగే ఎన్నికల్లో అధికారంలోకి వస్తామంటూ చెప్పడం/కలలు కనడం హాస్యాస్పదంగా ఉందంటున్నారు. ఐదేళ్ల తర్వాత పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందో లేదో...పక్కనపెడితే అప్పటివరకూ తమ రాజకీయ మనుగడ సాగాలంటే మాత్రం ఏదో ఒక పార్టీలో చేరిపోవాల్సిందేననే భావనతో పలువురు వైసీపీ కార్పొరేటర్లు ఉన్నారు. త్వరలోనే వలసలు ప్రారంభమవ్వడం ఖాయమని ఆ పార్టీ నేతతే చెబుతుండడం విశేషం.

ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీ?

.. 3వ పేజీ తరువాయి

తీసుకువస్తారన్న వాదన వినిపిస్తోంది. గతంలో అతికొద్దికాలం నగర పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన ఓ అధికారి తిరిగి వచ్చేందుకు యత్నిస్తున్నట్టు తెలిసింది. ఇక పోలీస్ కమిషనరేట్‌లో జాయింట్ సీపీ ఫకీరప్ప బదిలీ కూడా ఉంటుందంటున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మను బదిలీ చేస్తారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. రేంజ్ డీఐజీ విశాలగున్ని కొద్దినెలల క్రితమే ఇక్కడకు వచ్చినా ఆయన్ను కూడా మార్చే అవకాశం ఉంది. అయితే జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు బదిలీ ఉండకపోవచ్చునని అంటున్నారు. కానీ...విశాఖ వంటి కీలక జిల్లాలో గత ప్రభుత్వంలో నియమితులైన వారిని కొనసాగిస్తారా?...అనేది చూడాలి. జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌కు మంచి పోస్టు ఇచ్చే అవకాశం ఉందంటున్నారు. ముక్కుసూటికి వ్యవహరించే అయన్ను వైసీపీ ప్రభుత్వం జాయింట్ కలెక్టర్ పోస్టు నుంచి తప్పించి అప్రాధాన్యమైన జీవీఎంసీ అడిషనల్ కమిషనర్‌గా నియమించింది. ఆయన సతీమణి పాస్‌పోర్టు అధికారిణిగా విశాఖలో పనిచేస్తున్నందున విశ్వనాథన్‌కు విశాఖలో పోస్టింగ్ ఇస్తారా?, సమీపంలో మరో జిల్లాకు పంపుతారా? అనేది చూడాలి. నగర కేంద్రంగా ఉన్న జీసీసీ ఎండీగా ఉన్న సురేష్‌కుమార్ బదిలీ ఖాయమని అంటున్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ పోస్టును భర్తీ చేసే అవకాశం ఉంది. ఇదిలావుండగా విశాఖ జిల్లాకు రావడానికి ఇతర జిల్లాల్లో పనిచేసే పలువురు అధికారులు ఇప్పటికే కూటమి నేతల చుట్టూ తిరుగుతున్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ పెద్దల ఆశీస్సులతో వచ్చిన అధికారుల బదిలీ ఖాయమని సంకేతాలు వెలువడడంతో ఇతర జిల్లాల్లో పనిచేసేవారు విశాఖ రావడానికి పైరవీలు ప్రారంభించారు. బహుశా జిల్లాలో ఉన్నతాధికారుల బదిలీలు పూర్తయిన తరువాత మిగతా శాఖల అధికారులకు స్థానచలనం ఉంటుంది.

జాడలేని క్రూయిజ్ నౌకలు

... 3వ పేజీ తరువాయి

అవకాశం ఉందన్నారు. కానీ ఇప్పటివరకూ దాని జాడ లేదు.

సెయిలింగ్‌కు వస్తే రూ.36 లక్షల ఆదాయం

క్రూయిజ్ నౌక ఒకసారి విశాఖపట్నం పోర్టుకు వస్తే రూ.2 కోట్ల వ్యాపారం జరుగుతుంది. దానిపై రాష్ట్రానికి 9 శాతం, కేంద్రానికి 9 శాతం జీఎస్‌టీ రూపంలో రూ.36 లక్షల ఆదాయం వస్తుంది. వారానికి నాలుగుసార్లు వస్తే కోటి రూపాయల దాటి ఆదాయం లభిస్తుంది. ఇంత ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పుడు కొన్ని లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి రోడ్ షోలు నిర్వహిస్తే ఫలితం ఉంటుంది. దానికి పోర్టు చొరవ తీసుకోవడం లేదు.

ముందుకువచ్చిన టూర్ ఆపరేటర్లు

రెండేళ్ల క్రితం ఎటువంటి టెర్మినల్ లేకుండానే క్రూయిజ్‌ని తీసుకువచ్చిన టూర్ ఆపరేటర్లు...ప్రస్తుత పరిస్థితిపై ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షులు విజయమోహన్ ఆధ్వర్యంలో పోర్టు అధికారులను కలిసి మాట్లాడారు. దీనిపై మూడు రోజుల క్రితం పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేశ్‌కుమార్ దూబె, రాష్ట్ర పర్యాటక శాఖ ప్రతినిధి, జిల్లా పర్యాటక శాఖ అధికారిణి జ్ఞానవేణి, తదితరులు క్రూయిజ్‌లను రప్పించడానికి ఎటువంటి చర్యలు చేపట్టాలనే దానిపై చర్చించారు. అంతర్జాతీయ వేదికలపై రోడ్ షోలు నిర్వహించాలని ఆపరేటర్లు ప్రతిపాదించారు. దీనికి ప్రణాళిక సిద్ధం చేసి, ముందుకువెళితే కనీసం ఏడాది తరువాతైనా క్రూయిజ్‌లు వస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. దీనికి అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

ఎంవీవీ కుటుంబ సభ్యుల కిడ్నాప్‌పై పునర్విచారణ చేపట్టాలి

▸▸ జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్



సీతంపేట, జూన్ 15: మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుటుంబ సభ్యులు, ఆయన అనుచరుడైన జీవీ కిడ్నాప్‌నకు గురై నేటికి ఏడాదవుతున్నా...ఈ కేసు కొలిక్కిరాకపోవడం దారుణమని, దీనిపై పూర్తిస్థాయిలో పునర్విచారణ చేపట్టి నిజానిజాలు తేల్చాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ డిమాండ్ చేశారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కిడ్నాప్ ఎందుకు చేశారన్న దానిపై ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అప్పటి ప్రభుత్వ పెద్దలు, పోలీస్ అధికారులు తొక్కిపెట్టారన్నారు. అప్పటి పోలీసు అధికారులు ఎంవీవీతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. ఈ కేసును తిరిగి మొదటి నుంచి దర్యాప్తు చేపట్టి వాస్తవాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో అరెస్టు అయిన నిందితుడు వెంకట్ ద్వారా రూ. వేలకోట్ల విలువ చేసే వందల ఎకరాల ఆస్తులు, స్థలాల సెటిల్‌మెంట్లు జరిగాయని, అవన్నీ ఎంవీవీ సత్యనారాయణ, జీవీల కోసమే జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. డేగా టీమ్ గ్యాంగ్‌స్టర్స్ ఎవరని, వారితో ఎంవీవీ, జీవీలకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. వీటన్నింటిపై సీబీఐతో విచారణ జరపాలని మూర్తియాదవ్ డిమాండ్ చేశారు.

సీతంపేటలో రోడ్డుపై మురుగునీరు



రాజేంద్రనగర్‌లో మురుగునీరు

సీతంపేట, జూన్ 15: గ్రేటర్ విశాఖ 25వ వార్డు సీతంపేట రాజేంద్రనగర్‌లో కాలువలు చెత్తాచెదారంతో నిండిపోవడంతో మురుగునీరంతా రోడ్డుపై వచ్చి ప్రవహిస్తోంది. దీంతో స్థా నికులు దుర్గంధం భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటికప్పు డు చెత్త తొలగించకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొంటోంది. పాదచారులు నడిచి వెళ్లాడానికి కూడా వీలు లేకుండా పోతుందని స్థానికులు వాపోతున్నారు. కాలువల్లో మురుగుతో దోమలు వ్యాప్తి చెంది రా త్రివేళల్లో ని ద్ర కరువవుతోందని ఆ వేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి మురుగుకాలువలు శుభ్రం చేసి చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

శివలింగపురం స్టేషన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు



స్టేషన్‌లో పరిశీలిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

విశాఖపట్నం, జూన్ 15: కొత్తవలస-కిరండోల్ లైనులోని శివలింగపురం స్టేషన్‌లో డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ శనివారం తనిఖీలు చేశారు. డబ్లింగ్ పనులు, సొరంగాలు, మలుపులు, పాయింట్లు, క్రాసింగ్‌లతోపాటు వంతెన నిర్వహణ కార్యకలాపాలను పరిశీలించారు. అలాగే, ట్రాక్షన్, సబ్ స్టేషన్లతోపాటు నీటి పరీవాహక ప్రాంతాలలో చేపడుతున్న భద్రత చర్యలను తనిఖీ చేశారు. భద్రతా ప్రమాణాలను పాటించాలని సిబ్బందికి సూచించారు. ఈ పర్యటనలో ఏడీఆర్‌ఎం సుధీర్‌కుమార్ గుప్తా, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గాలివానకు నేలకొరిగిన చెట్లు



శాంతిపురంలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

సీతంపేట, జూన్ 15: సీతంపేట శంకరమఠం రోడ్డు శాంతిపురంలో శనివారం సాయం త్రం పడిన ఈదురుగాలులతో కూడిన వర్షానికి పెద్ద చెట్టు నెలకొరిగింది. అయితే ఆ సమయంలో అటుగా ఎవరు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికుల దారికి అడ్డు లేకుండా చెట్టు కొమ్మలకు తొలగించారు.

విశాఖపట్నం: ఈదురుగాలులకు నగరంలోని పలు ప్రాంతాలలో చెట్లు, ఎన్నికల ప్రచార బ్యానర్లు ఎగిరిపోయాయి. ద్వారకానగర్ రోడ్‌లో బాయ్ లండన్ దుకాణం ఫుట్‌పాత్‌పై రహదారి పక్కనున్న ఒక చెట్టు కూలి వైర్లపై పడింది. దీంతో గురుద్వారా, సీతంపేట వైపు నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు వచ్చే వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. అలాగే, ద్వారకానగర్ బుధిల్‌పార్క్ సమీపంలో మరో చెట్టు కూలిపోయింది.



వల్లి, దేవసేనలతో సుబ్రహ్మణ్యస్వామి

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

పెందుర్తి, జూన్ 15: వెంకటాద్రి శిఖరం దిగువన గల వల్లి, దేవసేన, సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఆలయ ప్రాంగణంలో వల్లి, దేవసేన, సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి రుత్వికులు శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపారు. మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు దంపతులు, తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

'నేను బడికి పోతా' ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెదగంట్యాడ, జూన్ 15: బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వియ్యపువానిపాలెం ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులు నేను బడికి పోతా అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. చదువుకోవడం వల్ల బాలికలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అమ్మాయిలు చదువుకోవలసిన ఆవశ్యకతను వారికి తెలియజేశారు. ఈ సందర్భంగా బాలికలకు ఆటపాటలు, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో బాలికలతో ర్యాలీ నిర్వహించారు. బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని, బాలబాలికల సాధికారతకు విద్య ఒకటే మార్గమని నినదిస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యను అందించాలి

పెదగంట్యాడ, జూన్ 15: విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి అన్నారు. పెదగంట్యాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం ఆయన స్టూడెంట్స్ కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం స్టూడెంట్ కిట్స్‌ను అందజేస్తుందన్నారు. హెచ్ఎం జోగారావు మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం స్టూడెంట్ కిట్స్‌ను పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు తిప్పల రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీధి లైట్లు వెలిగేలా చూడాలని వినతి

అగనంపూడి, జూన్ 15: అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల్లో వీధి దీపాలను వెలిగించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పినమడక, కొత్తూరు గ్రామాల్లో వెలగని వీధి లైట్లను గుర్తించి, వాటి వివరాలతో కూడిన జాబితాను జీవీఎంసీ వీధి లైట్ల విభాగం అధికారులకు శనివారం అందజేశారు. రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలగకపోవడం వల్ల స్థానికులు పడుతున్న ఇబ్బందులను టీడీపీ స్థానిక నాయకుడు అండిబోయిన మంగరాజు వివరించారు. అందువల్ల అధికారులు స్పందించి వీధి లైట్లు వెలిగేలా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. కూటమి నాయకులు కడవల మంగరాజు, కె.భాస్కర్, కె.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టోపీలు పంపిణీ

పెందుర్తి, జూన్ 15: ఎండ వేడిమికి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు గాను చినముషిడివాడ శాంతినగర్‌లోని పాఠశాల విద్యార్థులకు చెరుకూరి వెంకటరావు అనే వ్యక్తి సమకూర్చిన టోపీలను కార్పొరేటర్ శానాపతి వసంత పంపిణీ చేశారు. శనివారం స్కూల్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్ఎం వాణి, స్థానిక నాయకుడు డి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మహరాజ :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)
- **మ్యూజిక్ షాపు మూర్తి:** రమాదేవి, విశేష్ (గాజువాక)
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **సత్యభామ :** సంగం, శ్రీకన్య (గాజువాక)
- **గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి :** వెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **గం గం గణేశా :** వెంకటేశ్వర, శ్రీకన్య (గాజువాక)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 50, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 40, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 48, బీరకాయలు 48, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 40, క్యాబేజ్ 24, క్యారెట్ 32, దొండకాయలు 34, బంగాళా దుంపలు 34, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 64, అల్లం (పాతది) 170, బరబటి 64, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 140, పొటల్స్ 38, కీరదోస 30, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 42, కంద 60, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, క్యర పెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	128
ఫారం ధర	--	148
విత్ స్కిన్	--	266
స్కిన్‌లెస్	--	276

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ IIIలో..



కొత్తపాలెం అండర్‌పాస్‌వే వద్ద కురుస్తున్న వర్షం



నడుపూరులో గాలుల తీవ్రతకు ఊగుతున్న చెట్లు

ఈదురు గాలులతో భారీ వర్షం

భారీ ఉరుములు, మెరుపులతో భీతిల్లిన ప్రజలు

లోతట్టు ప్రాంతాలు జలమయం

గోపాలపట్నం, జూన్ 15: ఈదురు గాలులతో కూడిన భారత వర్షం కురవడంతో ప్రజలు ఊరట చెందారు. ఇప్పటికే ఎండ తీవ్రత పెరగడంతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు శనివారం సాయంత్రం కురిసిన వర్షంతో సేదదీరారు. కాగా ఈదురు గాలులతో పాటు భారీ ఉరుములు, మెరుపులు రావడంతో జనాలు భీతిల్లిపోయారు. ఈదురుగాలుల వల్ల చెట్లు విరిగిపడడం, విద్యుత్ వైర్లు తెగిపడే ప్రమాదం ఉన్నందున ముందస్తుగా ఈపీడీసీఎల్ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో సుమారు రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా నిత్యం రద్దీగా ఉండే గోపాలపట్నం ప్రధాన రహదారిలోని ఫుట్‌పాత్ దుకాణాలు తెరవకపోవడంతో సాయంత్రం నుంచి రోడ్డు నిర్మానుష్యంగా మారింది. కాగా కొండవాలు ప్రాంతంలో రిటెయినింగ్ వాల్‌లు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని కొండవాలు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



హెచ్‌బీ కాలనీ మైదానంలో నిలిచిన వర్షపు నీరు

గాజువాక: గాజువాక పరిసర ప్రాంతాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం సుమారు గంటపాటు కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలుల తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఈదురుగాలుల ప్రభావంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం వాటిల్లింది.



చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు



యాదవ జగ్గరాజుపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం

డీఎస్సీ, పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్ రద్దు తదితర వాటిపై సంబరాలు

ఎన్.ఎ.డి.జంక్షన్, జూన్ 15: ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేశాక డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ రద్దు, పింఛన్ల పెంపు, తదితర హామీలకు సంబంధించిన ఫైళ్లపై సంతకం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి స్వీట్లు పంచిపెట్టారు.

టీడీపీ 52వ వార్డు అధ్యక్షుడు ఎం.వాసుదేవరావు ఆధ్వర్యంలో మర్రిపాలెం వుడా కాలనీలో శనివారం పాలాభిషేకం చేశారు. ఈ ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా పాలన ఆరంభమైందన్నారు. చంద్రబాబు సంతకం చేసిన ఐదు హామీల అమలు వల్ల ప్రజలకెంతో మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణ, అనిల్‌కుమార్, ప్రసాదరెడ్డి, భాస్కర్ రెడ్డి, త్రినాథ్, రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: ఎన్నికల హామీల్లో భాగంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఐదింటిని అమలు చేస్తూ ఆయా ఫైళ్లపై సీఎం చంద్రబాబు సంతకాలు చేయడంపై ఆనందం వ్యక్తం చేస్తూ 92వ వార్డు పరిధి కంపరపాలెంలో డ్వాక్రా మహిళలు సంబరాలు జరుపుకున్నారు. కంపరపాలెం కాలనీలో ఎస్ఎల్ఎఫ్ అధ్యక్షురాలు కంచిపాటి నాగమణి ఆధ్వర్యంలో మహిళలు కేక్ కట్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని, డ్వాక్రా మహిళలు మరింత అభివృద్ధి సాధిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎల్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

'పల్లా'కు కీలక పదవి ఇస్తారంటూ..

కూర్మన్నపాలెం: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా గాజువాక ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలుపొందిన పల్లా శ్రీనివాసరావును అధిష్ఠానం నియమిస్తుందన్న సమాచారంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగా 88వ వార్డులో టీడీపీ జిల్లా నాయకుడు గొలగాని సన్యాసిరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సన్యాసిరావు మాట్లాడుతూ వైసీపీ హయాంలో ఎన్ని ఆటుపోట్లు వచ్చినా నిలబడి ధైర్యంగా టీడీపీని ముందుకు తీసుకువెళ్లిన బీసీలో బలమైన నేత, విద్యావంతుడు, ఎమ్మెల్యేగా గెలుపొందిన పల్లా శ్రీనివాసరావును టీడీపీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమిస్తే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మాడిశ ప్రసాద్, కె.వెంకట్రావు, వై.నరసింగరావు, జి.పెంటయ్య, గంగరాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వీవీవీ స్కూల్ కొనసాగింపుపై కొనసాగుతున్న చర్చలు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 15: స్టీల్‌ప్లాంట్ విశాఖ విమల విద్యాలయం కొనసాగింపుపై చర్చలు కొనసాగుతున్నాయి. శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులు, వివిధ సంఘాల ప్రతినిధులు, పాఠశాల యాజమాన్యం మధ్య చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్యం తాము ఆర్థిక భారాన్ని భరించలేమని, ఉక్కు యాజమాన్యం పాత పద్ధతిలో కొనసాగించడం లేదా ఉపాధ్యాయులు తమ జీతాలను తగ్గించుకోవడమో చేయాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు తమ సర్వీసు రూల్స్ విషయంలో కొంతమేర తగ్గారు. ఉద్యోగులు వేతనాలు, పీఆర్సీ, ఎరియర్స్ వంటి వాటిపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. వివిధ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ పాఠశాలను యథావిధిగా నడపాలని, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. చర్చల అంశాన్ని ఉక్కు యాజమాన్యం దృష్టికి తీసుకువెళతామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కరణంరెడ్డి నరసింగరావు, నమ్మి సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.



చర్చల్లో పాల్గొన్న స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, వివిధ సంఘాల ప్రతినిధులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని పరామర్శిస్తున్న సీఎం రమేశ్

రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించిన ఎంపీ

గాజువాక, జూన్ 15: పాడేరు రోడ్డు ప్రమాదంలో గాయపడి గాజువాకలోని ఆర్కే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ పరామర్శించారు. బాధితులతో ఆయన మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలని, అందరినీ ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందివాలని వైద్యులను కోరారు. ఆయన వెంట బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, నాయకులు గూటూరు శంకరరావు, తాతారావు ఉన్నారు.

మధుమేహం పట్ల అప్రమత్తంగా ఉండాలి

అక్కిరెడ్డిపాలెం, జూన్ 15: మధుమేహ వ్యాధి పట్ల అవగాహన కలిగి వుండడంతో పాటు వ్యాధిని సకాలంలో గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే తప్పనిసరిగా అరికట్టవచ్చని ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ శ్రావణి తాన్న అన్నారు. జాతీయ మధుమేహ వ్యాధి వారోత్సవాల సందర్భంగా షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతు మంచి ఆహార నియమాలు పాటించడంతో పాటు నిత్యం వ్యాయామం, ఆరోగ్య నియమాలు ఆచరించడం వలన మధుమేహ వ్యాధి రాకుండా చూడవచ్చన్నారు. ఆకలి, దాహం ఎక్కువగా వుండడంతో పాటు ఆకస్మికంగా బరువు తగ్గడం, కంటి చూపు మందగించడం తరుచు మూత్రం రావడం వంటి మధుమేహ లక్షణాలు కనిపిస్తే వాటికి తగిన చికిత్స తీసుకొన మధుమేహ వ్యాధిని నియంత్రించేందుకు ప్రయత్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బందితో పాటు స్థానికులు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయాల వార్షికోత్సవ పోస్టర్లు ఆవిష్కరణ

అక్కిరెడ్డిపాలెం, జూన్ 15: తుంగ్లాం కాలనీలో గత ఏడాది నిర్మించిన కుంచుమాంబ, దుర్గమాంబ, ముత్యమాంబ అమ్మవార్ల ఆలయాల ప్రథమ వార్షికోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ఆవిష్కరించారు. తుంగ్లాంలోని విజయరాఘవస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులతో కలిసి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరి సహకారంతో వార్షికోత్సవాలను ఈ నెల 17న ఘనంగా నిర్వహించనున్నామన్నారు. ఆలయ కమిటి సభ్యులు కొల్లి అప్పలరెడ్డి, కె.కుంచారావు, డి.పాపారావు, పి.అర్జున్, డి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

ఆటోనగర్‌లో అన్న క్యాంటీన్ పరిసరాలు శుభ్రం

ఆటోనగర్, జూన్ 15: పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని వర్గాల నుంచి ఆనందం వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు సంబంధించిన ఫైలుపై సంతకం చేయడంతో పలు ప్రాంతాల్లో ఐదేళ్లుగా నిరుపయోగంగా పడివున్న అన్న క్యాంటీన్లను సిబ్బంది శనివారం నుంచి యుద్ధప్రాతిపదికన శుభ్రం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆటోనగర్ డీ-బ్లాకులో ఉన్న అన్న క్యాంటీన్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని శుభ్రం చేస్తున్నారు. ఇప్పటికే ఇక్కడి అన్న క్యాంటిన్‌లోని విలువైన సామగ్రిని దొంగలు ఎత్తుకుపోయారు. పెద్దఎత్తున పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కల తొలగింపు పనులు పూర్తి చేసేందుకు మూడు రోజుల సమయం పడుతుందని సిబ్బంది తెలిపారు.

రూ.5తో కడుపునిండా భోజనం చేసేవాన్ని..



-కె.సూరిబాబు, ఆటో డ్రైవర్, వడ్లపూడి

టీడీపీ ప్రభుత్వ హయాంలో నాగు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను గత వైసీపీ ప్రభుత్వం మూసివేశాక ఎన్నో ఇబ్బందులకు గురయ్యాం. అన్న క్యాంటీన్లు ఉన్నప్పుడు మధ్యాహ్నం పూట ఇంటికి వెళ్లలేని సమయంలో రూ.ఐదుకే భోజనం చేసేవాన్ని. త్వరలో మళ్లీ అన్న క్యాంటీన్లను తెరుస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉంది. పేదలకు అన్న క్యాంటీన్లు ఒక వరం లాంటివి.

సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవం

అగనంపూడి, జూన్ 15: అవినీతిని వెలికి తీసేందుకు సమాచార హక్కు చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆ చట్టం ఉద్యమకర్త పట్నా రామఅప్పారావు అన్నారు. అగనంపూడిలోని సీడబ్ల్యూసీలో శనివారం నిర్వహించిన సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం గురించి ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇప్పటికీ చాలా మందికి సమాచార హక్కు చట్టం గురించి తెలియపోవడం బాధాకరమన్నారు. ఈ చట్టం ద్వారా అవినీతి రహిత సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సర్వహిత చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు గుదే సుశీగజేంద్రరావు, మస్తాన్‌రెడ్డి, బొండా ఈశ్వరరావు, కె.అప్పారావు, డి.త్రిమూర్తులు, ఎస్.రామారావు, తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో రక్త దాతలు

షిప్‌యార్డులో రక్తదాన శిబిరం

మల్కాపురం, జూన్ 15: షిప్‌యార్డులో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. షిప్‌యార్డు, లయన్స్ బ్లడ్ సెంటర్ సంయుక్తంగా చేపట్టిన ఈ శిబిరాన్ని హెచ్ఎస్ఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్ అండ్ కమర్షియల్) ఎస్వీ రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల మరొకరికి ప్రాణ దానం చేసిన వారవుతామన్నారు. కార్యక్రమంలో షిప్‌యార్డు డైరెక్టర్ (ఎస్‌పీ) గిరిధర్ సింగ్, ప్రధాన వైద్యాధికారి చంద్రశేఖర్ రెడ్డి, కంపెనీ సెక్రటరీ బేగ్, డీజీఎం (హెచ్ఆర్) కె.కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డులో కాంక్రీట్ దిబ్బ తొలగింపు



కాంక్రీట్ దిబ్బను తొలగించి రోడ్డును చదును చేసిన దృశ్యం

ఎన్.ఎ.డి.జంక్షన్, జూన్ 15: బుచ్చిరాజుపాలెం నుంచి ఎన్ఏడీ ఫ్లైఓవర్ దిగువ ప్రాంతానికి వెళ్లే సర్వీసు రోడ్డులోని చివరిలో నెలకొన్న కాంక్రీట్ దిబ్బ వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్టు 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు స్పందించారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో సర్వీసు రోడ్డులో ట్రాఫిక్ అధికంగా ఉంటుంది. అంతేకాకుండా ఎన్ఎస్టీఎల్ వైపునకు వెళ్లేందుకు అత్యధికులు రాంగ్ రూట్ అయినప్పటికీ ఈ మార్గంలో ప్రయాణం చేస్తుంటారు. కాగా అధికారులు ఎట్టకేలకు స్పందించిన అధికారులు రోడ్డుకు షిల్లర్ కాంక్రీట్‌కు సమానంగా లేకపోవటం ఎత్తుగా ఉన్న కాంక్రీట్ దిబ్బను సరిచేసి, ప్లాస్టింగ్ చేశారు. వాహనాలు ప్రమాదాలు కాకుండా ఉండేలా మరమ్మత్తులు చేపట్టారు. దీంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఉక్కు ఉద్యోగులకు ఇప్పటికీ అందని జీతాలు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 15: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు 15వ తేదీ వచ్చినప్పటికీ ఇప్పటివరకు జీతాలు అందలేదు. గత కొన్ని నెలలుగా ఉక్కు ఉద్యోగులకు జీతాల చెల్లింపులో ఆలస్యం చోటుచేసుకుంటుంది. గత నెలలో అదానీ పోర్టు కార్మికుల సమ్మె కారణంగా ప్లాంట్‌పై అధిక భారం పడడంతో జీతాలు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరిగింది. అయితే ఈ నెల అయినా సకాలంలో చెల్లిస్తారని ఆశించిన ఉద్యోగులకు నిరాశే మిగిలింది. జీతాలు ఎప్పుడు ఇస్తారన్న దానిపై యాజమాన్యం స్పష్టత ఇవ్వడం లేదని కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: దువ్వాడ సీఐ

కూర్మన్నపాలెం, జూన్ 15: డ్రగ్స్ వినియోగం ఆరోగ్యానికి హానికరమని, అందువల్ల డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ జీవితాలను కాపాడుకోవాలని దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు సూచించారు. 87వ వార్డు కణితి హైస్కూల్ విద్యార్థులకు శనివారం 'మాదకద్రవ్యాల నిరోధకం-డ్రగ్స్ వినియోగం వల్ల అనర్థాలు' అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఎప్పుడూ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మాదకద్రవ్యాల వినియోగంతో విద్యార్థుల భవిష్యత్తుకు పెనుముప్పు వాటిల్లుతుందన్నారు. యువశక్తి దేశానికి ఎంతో అవసరమని, అందువల్ల యువత మత్తు పదార్థాలకు బానిసలు కారాదని కోరారు. పాఠశాల హెచ్ఎం బి.సూర్యప్రకాశ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల జోలికి టీనేజర్స్ వెళ్లకూడదన్నారు. ఒకసారి మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు ఛిద్రమవుతాయన్నారు. అనంతరం మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మన్నాజీ, అప్పారావు, నాయుడు, అరుణ, నూకరత్నం, భారతి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



పూజలు జరుపుతున్న వేదపండితులు

అక్కిరెడ్డిపాలెం, జూన్ 15: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక హోమాలతో పాటు పూజలు నిర్వహించారు. శ్రీవారిని వేదపండితులు పంచామృతాలతో అభిషేకించాక పువ్వులు, నగలతో అలంకరించారు. అనంతరం స్వామివారికి టీటీడీ వేదపండితులు తోమాలసేవ, గరుడ ప్రతిష్ఠ చేశారు. దివ్యక్షేత్రం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక యాగశాలలో వేదపండితులు అకల్మష హోమం, ఆదివాస్త్రయ హోమాలు జరిపారు. పూజల్లో ఎస్టీబీఎల్ చైర్మన్ గుత్తికొండ బాలాజీ వీరభద్రరావు దంపతులు, ట్రస్టీలు, భక్తులు పాల్గొన్నారు.

మద్యం పాలసీ విధానంలో తమకు ప్రాధాన్యం ఇవ్వాలి

గీత సహకులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెల్లుబోయిన నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న నాయుడు

పెదగంట్యాడ, జూన్ 15: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేయనున్న మద్యం పాలసీ విధానంలో గీత సహ కులాల వారికి అధిక ప్రాధాన్యమివ్వాలని పారిశ్రామిక ప్రాంత గీత సహకులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెల్లుబోయిన నాయుడు కోరారు. వుడా కాలనీలోని సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్లుగీత వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న గీత సహ కులాలవారికి ఇప్పుడు పని లేకుండా పోయిందని, అందువల్ల ప్రభుత్వం మంజూరు చేసే మద్యం షాపుల్లో 30 శాతం గీత సహ కులాల వారికి కేటాయించాలని కోరారు. మద్యం షాపులను వేలం పాట రూపంలో కేటాయిస్తే ఆబ్కారీ శాఖకు చెల్లించాల్సిన డిపాజిట్‌లో 20 శాతం మాత్రం గీత సహ కులాలకు చెందిన వేలం పాటదారుల నుంచి వసూలు చేయాలని పేర్కొన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు నెల్లి సాధూరావు మాట్లాడుతూ గీత సహకులాల వారిని ఆదాయ పన్ను రిటర్న్స్ దాఖలు చేసే క్లాజు నుంచి మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు ఒనిమి నాగేశ్వరరావు, డి.దేవన్‌రాజు, ఎ.పెదనూకరాజు, ఎన్.గురుమూర్తి, సీహెచ్ నాగరాజు, జె.గోవింద్, చంటి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు సత్కారం

అగనంపూడి, జూన్ 15: స్థానిక షిర్డీసాయి సేవా మందిరంలో ప్రతి వారం అన్నదానానికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న ఎం.సూరీడమ్మను షిర్డీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఇక్కడి సాయిబాబా ఆలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సేవా సమితి ప్రతినిధులు అన్నదానానికి సూరీడమ్మ కుటుంబ సభ్యులు అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు వ్యాసశర్మ, శంభుడు, గోవిందరావు, టోపీరాజు, పీఎల్ఎన్ రాజు, సత్యలక్ష్మి, లీలావతి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల యూనియన్ జిల్లా అధ్యక్షురాలిగా వెంకటలక్ష్మి


వెంకటలక్ష్మి

జగదాంబ కూడలి, జూన్ 15: ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) విశాఖ జిల్లా అధ్యక్షురాలిగా ఎం. వెంకటలక్ష్మి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. శనివారం జగదాంబ వద్ద సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశం లో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి సమక్షంలో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే, భీమిలి ఐసీడీ ఎస్ ప్రాజెక్టునుంచి నరసయ్యమ్మను జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అంగనవాడీ వర్కర్స్ సమస్యలపై కూటమి నూతన ప్రభు త్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవెరుస్తుందన్న ఆశాభావాన్ని రాష్ట్ర, జిల్లా నాయకులు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ యూ నియన్ గౌరవ సలహాదారు బృంద, మాజీ జిల్లా ప్ర ధాన కార్యదర్శి ఆర్. వెంకటలక్ష్మి, గౌరవ అధ్యక్షురాలు పి. మణి, ప్రధాన కార్యదర్శి ఎల్. దేవి, కార్యనిర్వాహక అధ్యక్షురాలు శోభారాణి, కోశాధికారి పద్మ పాల్గొన్నారు.

'డయల్ యువర్ సీపీ'కి 17 ఫిర్యాదులు

మహారాణిపేట, జూన్ 15: పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో శనివారం డయల్ యువర్ సీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఏ రవిశంకర్‌కు 17 మంది కాలర్స్ ఫోన్ చేసి స్వయంగా తమ సమస్యలను విన్నవించారు. కమిషనర్ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను చట్టపరంగా చర్యలు తీసుకుని పరిష్కరించాలని సూచించారు.

శ్రీశ్రీతో తెలుగు సాహిత్యానికి కొత్త మలుపు

సీతంపేట, జూన్ 15: మహాకవి శ్రీశ్రీ తెలుగు సాహిత్యానికి కొత్త ఒరవడి, కవుల్లో నవ్యరీతి ఆ లోచనా ధోరణిలను రేకెత్తించారని సాహితీవేత్తలు కొనియాడారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆచార్య చందు సుబ్బారావు సా హితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వ ర్యంలో మహాకవి శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా సాహిత్య సభను ని ర్వహించారు. ఆధునిక సాహిత్య వై తాళికుడు శ్రీశ్రీ అనే అంశంపై నిర్వహించిన ఈసదస్సుకు ట్రస్ట్ చైర్మన్, యూపీఎస్సీ పూర్వ సభ్యులు ఆచార్య కేఎస్ చలం అధ్యక్షత వహించి మాట్లాడారు. శ్రీశ్రీ కవిత్వంపై రచయిత, కవి పురిపండ అప్పలస్వామి ప్రభావం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిస్థితులను శ్రీశ్రీ ఊహించిముందే చెప్పారని, ప్రస్తుతం అవే కొనసాగుతున్నాయన్నారు. ప్రముఖ సాహితీ విమర్శకులు ఆచార్య చందు సుబ్బారావు మాట్లాడుతూ శ్రీశ్రీ కవిత్వంతో సమాజంలో గొప్ప సంస్కరణలు తెచ్చారన్నారు. సినీ రంగంలో కూడా మంచి పేరు సంపాదించారన్నారు. రాష్ట్రపతి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గరిమెళ్ల నాగేశ్వరరావు శ్రీశ్రీ అద్భుతంగా కవిత్వం రాయడానికి ఆ యన దేశీయ భాషలతో పాటు పాశ్చాత్య సాహిత్యంపైనా మంచి పట్టు ఉండడమే కారణమని అన్నారు. గరిమెళ్ల నాగేశ్వరరావుకు చంద్ర ట్రస్ట్ ప్రోత్సాహక పురస్కార ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేడా మస్తాన్ రెడ్డి, చందు సాహితీ సంస్థ కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, డాక్టర్ డీవీ సూర్యారావు, శ్యామసుందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.


గరిమెళ్ల నాగేశ్వరరావుకు చంద్ర ట్రస్ట్ పురస్కారం అందిస్తున్న అతిథులు

మురళీనగర్; మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో శనివారం మహాకవి శ్రీ శ్రీ 41వ వర్ధంతి కార్యక్రమం చేపట్టారు. ముందుగా ఆయన చిత్ర పటానికి వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి, పూర్వ అధ్యక్షులు ఎస్.బుచ్చయ్య చౌదరి క్లబ్ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం క్లబ్ కార్యవర్గ సమావేశం నిర్వహించి పార్కు ఉన్నతికి తీసుకునే నిర్ణయాలను తెలిపారు.

కళలను ప్రోత్సహించాలి

▸ దేవదాయశాఖ సహాయ కమిషనర్ శిరీష


సాంస్కృతిక ప్రదర్శలను ప్రారంభిస్తున్న శిరీష

మురళీనగర్, జూన్ 15; భారతీయ సంగీత, నృత్య కళా రీతులు గొప్పవని, వాటిని ప్రోత్సహిస్తూ కాపాడుకోవాలని దేవదాయశాఖ సహాయ కమిషనర్ శిరీష పేర్కొన్నారు. ఆర్ అండ్‌బీ జంక్షన్ శ్రీ భూసమేత విజయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నాట్య పరిమళ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడెమీ ఆధ్వర్యంలో అష్టోత్తర శత నృత్య సంకీర్తనార్చనలో భాగంగా 34 వ ఆధ్యాత్మిక ఉత్సవం చేపట్టారు. ముఖ్య అతిథిగా పాల్గొని ఆమె మాట్లాడారు. తమ శాఖ ద్వారా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల ద్వారా కళా సంస్థలను, కళాకారులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ సభాధ్యక్షులుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాలలు 80 మంది పాల్గొన్నారు. అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేశారు. కళాకారులకు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో కళాకారుల తల్లిదండ్రులు, వేంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మొక్కలకు నీరు పెట్టడంలో అవినీతి

▸ విచారణ చేపట్టాలని కమిషనర్‌కు సీపీఐ విజ్ఞప్తి

జ్ఞానాపురం, జూన్ 15: జీవీఎంసీలో మొక్కలకు నీరు పోసే ట్రిప్పర్లలో జరిగిన భారీ కుంభకోణంపై సమగ్రవిచారణ జరిపించి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని కోరుతూ సీపీఐ విశాఖజిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. జీవీఎంసీ పరిధిలోని 98వార్డుల్లో మొక్కలకు మంచినీటి ట్యాంకర్ల ద్వారా నీరు పోసేందుకు 11మంది గుత్తేదారులు టెండర్లు దక్కించుకున్నారన్నారు. అయితే, ఇటీవల 2600 ట్రిప్పులు నీరుపోసినట్టు, దీనికి బిల్లులు చెల్లించాలని చెప్పి రూ. 60 లక్షలు కాజేయాలను చూడడం.. దీనికి అధికారులు సహకరించడం దుర్మార్గమని పైడిరాజు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ వ్యవహారంలో జీపీఎస్ ద్వారా చెక్ చేస్తే కేవలం 900 ట్రిప్పులు మాత్రమే బయటపడినట్టు ఆయన ఆరోపించారు. నగరప్రజలు పన్నుల రూపంలో కడుతున్న డబ్బు దోచుకుంటున్న గుత్తేదారులు, వారికి సహకరిస్తున్న జీవీ ఎంసీ అధికారులను గుర్తించి తగిన చర్యలు తీసకోవాలని ఆయన కోరారు.

ఆయుర్వేద వైద్యంతో రుగ్మతల నివారణ

మహారాణిపేట, జూన్ 15: ఆయుర్వేదం చికిత్సతో అనేక రుగ్మతలు నివారించవచ్చునని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు గౌతమ్ కృష్ణమూర్తి అన్నారు. శనివారం జిల్లా పరిషత్ వందిమెట్ట వద్ద నిర్వహించిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుర్వేద ఎప్పుడు ఎవరు కనుగొన్నారు. దీనిని ఎవరు అభివృద్ధి చేశారు అన్నదానిపై కచ్చితమైన సమాచారం లేదని, కానీ, ఈ చికిత్సలో ఎన్నో ప్రయోజనాలున్నాయన్నారు. చికిత్స సమయంలో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అనుసరించటం చాలా అవసరమని అన్నారు. ఈ కార్య క్రమంలో పలువురు పాల్గొన్నారు.

19 నుంచి ఐటీఐ ప్రవేశాలకు కౌన్సెలింగ్

కంచరపాలెం, జూన్ 15: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు ఈనెల 19వ తేదీ నుంచి నుంచి కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నారు. ఈ మేరకు కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో ఏర్పాట్లు పూర్తిచేసినట్టు అధికారులు జె. శ్రీకాంత్, వై. ఉమాశంకర్ తెలిపారు. ప్రతి రోజూ రెండు విడతల్లో ఉదయం 8గంటలకు మొదటి బ్యాచ్, మధ్యాహ్నం ఒంటిగంటకు రెండో బ్యాచ్ చొప్పున కౌన్సెలింగ్ చేయనున్నారు. ఐటీఐ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసిన వారిలో 3398 మంది అభ్యర్థులు తమ ధ్రువపత్రాలను వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయింది. ఈ అభ్యర్థులకు మాత్రమే కౌన్సెలింగ్‌నకు అనుమతిస్తారు.

11 మంది నిరాశ్రయుల గుర్తింపు


నిరాశ్రయులతో ఆర్పీఎఫ్‌లు, ఏయూటీడీ సిబ్బంది

అక్కయ్యపాలెం, జూన్ 15: రైల్వే స్టేషన్‌లో ఆర్పీఎఫ్, ఏయూటీడీ సిబ్బంది సంయుక్తంగా చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్‌లో 11 మంది నిరాశ్రయులను గుర్తించి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం కల్పించినట్టు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. వీరిలో కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో భిక్షాటన చేస్తున్న వారే అధికంగా ఉన్నారన్నారు. వీరికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్టు చెప్పారు.

నారా లోకేశ్‌కు ఏపీఆర్‌టీఈ ఫోరం శుభాకాంక్షలు

డాబాగార్డెన్స్, జూన్ 15: రాష్ట్ర మంత్రి వర్గంలో విద్యాశాఖా మంత్రిగా నియమితులైన నారా లోకేశ్‌కు ఆంధ్రప్రదేశ్ రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం తరపున రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో విద్యా హక్కు చట్టం పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోకపోవడంతో డ్రాప్‌ఔట్స్ , బాల కార్మికుల సంఖ్య ఘననీయంగా పెరిగిందన్నారు. అలాగే ప్రైవేట్ స్కూళ్లలో పేద బాలలకు 20 శాతం ఉచిత సీట్లు కేటాయించేలా చూడాలని కోరారు. లోకేశ్ సారథ్యంలో బాలల హక్కుల పరిరక్షణకు భరోసా ఉండగలదని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

అక్కయ్యపాలెం, జూనన్ 15: కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు రజతోత్సవాల్లో భాగంగా అక్కయ్యపాలెం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఆ దివారం ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నట్టు బ్యాంక్ చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు ఖాతాదారులు, శ్రేయోభిలాషులు ఈ శిబిరంలో పాల్గొని పలు వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అలాగే రక్తదానానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

స్కూల్ బస్సులు ఫిట్‌నెస్‌తో ఉండాలి: సీఐ



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ ప్రసాద్

సీతంపేట, జూన్ 15: పాఠశాలలకు విద్యార్థులను తీసుకువెళ్లే ఆటోలు, బస్సులు పూర్తి ఫిట్‌నెస్‌తో ఉండేలా చూసుకోవాలని ద్వారకా ట్రాఫిక్ సీఐ ప్రసాద్ అన్నారు. సీతంపేట రోడ్డు ద్వారకానగర్‌లోని భాష్యం స్కూల్‌లో యాజమాన్యం, ఆటో డ్రైవర్లకు ఎస్ఐ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ప్రసాద్ మాట్లాడుతూ మితిమీరిన వే గంగా వాహనాలు నడపరాదని, పరిమితికి మించి పిల్లలను తీసుకు వెళ్లరాదన్నారు.ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

టీడీఆర్‌లపై కూటమి దృష్టి

.. 3వ పేజీ తరువాయి

భూమి కూడా ప్రైవేటుదేనని, వారసులుగా పేర్కొంటూ కొంతమందిని వైసీపీ నేతలే తెరపైకి తెచ్చారు. వైసీపీ నేతలు వెనకుండి ఆ భూమికి నాలుగు రెట్లు సుమారు రూ.వంద కోట్లు విలువైన టీడీఆర్ కొట్టేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. అలాగే దసపల్లా హిల్స్ ప్రాంతంలో సర్క్యూట్‌హౌస్ జంక్షన్ నుంచి నౌరోజీ రోడ్డు జంక్షన్ వరకూ వంద అడుగులు మాస్టర్‌ప్లాన్ రోడ్డు నిర్మాణానికి ఇటీవల జీవీఎంసీ నోటిఫికేషన్ జారీచేసింది. ఒకవేళ అంతా అనుకున్నట్టు జరిగితే నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించి కొన్నాళ్ల కిందటే ప్రైవేటు భూములుగా రికార్డుల్లో నమోదైన దసపల్లా హిల్స్ భూ యజమానులకు రోడ్డు నిర్మాణం కోసం తీసుకునే భూమికి పరిహారంగా టీడీఆర్ జారీచేయాల్సిన పరిస్థితి. అందుకు విపక్షాలు అడ్డంపడడంతో తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఈలోగా ఎన్నికలు సమీపించడంతో టీడీఆర్‌ల జారీని పక్కనపెట్టాలని వైసీపీ నేతలు జీవీఎంసీ అధికారులకు సూచించారు. మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు టీడీఆర్‌లన్నింటినీ తీసు కోవచ్చునని వైసీపీ నేతలు భావించారు.కానీఘోరపరాజయం పాలవ్వడం,కూటమి అధికారంలోకి రావడంతోవైసీపీ నేతలతోపాటు జీవీఎంసీలోని కొందరు అధికారులకు కంగు తి న్నారు. గత ప్రభుత్వంలో టీడీఆర్ పేరుతో భారీగా అక్రమాలు జరిగాయని, ఇప్పుడు వాటన్నింటినీ తవ్వితీయాలని కూటమి నేతలు భావిస్తున్నారు. ఆ మేరకు ఇప్పటికే సమాచార సేకరణలో నిమగ్నమవ్వడంతో బాధ్యులైన అధికారుల్లో గుబులు మొదలైంది.

తీరు మార్చుకోరా!?

.. 3వ పేజీ తరువాయి

సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి రెండు రోజుల క్రితం నగరంలోని ముఖ్య నేతలు, ఎన్నికల్లో ఓటమి పాలైన అభ్యర్థులతో సమావేశమయ్యారు. అనంతరం కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సుమారు 15 మంది వరకూ కార్పొరేటర్లు గైర్హాజరయ్యారు. ఎన్నికల్లో పార్టీ ఓటమికి గల కారణాలను అడిగి తెలుసుకోవడంతోపాటు ఆయన వైపు నుంచి గుర్తించిన అంశాలను తమతో పంచుకుంటారని నేతలు, కార్పొరేటర్లు భావించారు. వాటిని ఎలా అధిగమించాలనే దానిపై దిశానిర్దేశం చేస్తారని ఆశించారు. కానీ ఆయన 40 శాతం మంది మన వెంటే ఉన్నారని, తిరిగి అధికారంలోకి వస్తామంటూ మాట్లాడడం తమను ఆశ్చర్యానికి గురిచేసిందని కొంతమంది నేతలు, కార్పొరేటర్లు పేర్కొంటున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై వారం రోజులు కూడా కాకుండానే ఐదేళ్ల తర్వాత జరిగే ఎన్నికల్లో అధికారంలోకి వస్తామంటూ చెప్పడం/కలలు కనడం హాస్యాస్పదంగా ఉందంటున్నారు. ఐదేళ్ల తర్వాత పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందో లేదో...పక్కనపెడితే అప్పటివరకూ తమ రాజకీయ మనుగడ సాగాలంటే మాత్రం ఏదో ఒక పార్టీలో చేరిపోవాల్సిందేననే భావనతో పలువురు వైసీపీ కార్పొరేటర్లు ఉన్నారు. త్వరలోనే వలసలు ప్రారంభమవ్వడం ఖాయమని ఆ పార్టీ నేతలే చెబుతుండడం విశేషం.

ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీ?

.. 3వ పేజీ తరువాయి

తీసుకువస్తారన్న వాదన వినిపిస్తోంది. గతంలో అతికొద్దికాలం నగర పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన ఓ అధికారి తిరిగి వచ్చేందుకు యత్నిస్తున్నట్టు తెలిసింది. ఇక పోలీస్ కమిషనరేట్‌లో జాయింట్ సీపీ ఫకీరప్ప బదిలీ కూడా ఉంటుందంటున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మను బదిలీ చేస్తారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. రేంజ్ డీఐజీ విశాలగున్ని కొద్దినెలల క్రితమే ఇక్కడకు వచ్చినా ఆయన్ను కూడా మార్చే అవకాశం ఉంది. అయితే జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు బదిలీ ఉండకపోవచ్చునని అంటున్నారు. కానీ...విశాఖ వంటి కీలక జిల్లాలో గత ప్రభుత్వంలో నియమితులైన వారిని కొనసాగిస్తారా?...అనేది చూడాలి. జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌కు మంచి పోస్టు ఇచ్చే అవకాశం ఉందంటున్నారు. ముక్కుసూటికి వ్యవహరించే ఆయన్ను వైసీపీ ప్రభుత్వం జాయింట్ కలెక్టర్ పోస్టు నుంచి తప్పించి అప్రాధాన్యమైన జీవీఎంసీ అడిషనల్ కమిషనర్‌గా నియమించింది. ఆయన సతీమణి పాస్‌పోర్టు అధికారిణిగా విశాఖలో పనిచేస్తున్నందున విశ్వనాథన్‌కు విశాఖలో పోస్టింగ్ ఇస్తారా?, సమీపంలో మరో జిల్లాకు పంపుతారా? అనేది చూడాలి. నగర కేంద్రంగా ఉన్న జీసీసీ ఎండీగా ఉన్న సురేష్‌కుమార్ బదిలీ ఖాయమని అంటున్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ పోస్టును భర్తీ చేసే అవకాశం ఉంది. ఇదిలావుండగా విశాఖ జిల్లాకు రావడానికి ఇతర జిల్లాల్లో పనిచేసే పలువురు అధికారులు ఇప్పటికే కూటమి నేతల చుట్టూ తిరుగుతున్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ పెద్దల ఆశీస్సులతో వచ్చిన అధికారుల బదిలీ ఖాయమని సంకేతాలు వెలువడడంతో ఇతర జిల్లాల్లో పనిచేసేవారు విశాఖ రావడానికి పైరవీలు ప్రారంభించారు. బహుశా జిల్లాలో ఉన్నతాధికారుల బదిలీలు పూర్తయిన తరువాత మిగతా శాఖల అధికారులకు స్థానచలనం ఉంటుంది.

జాడలేని క్రూయిజ్ నౌకలు

... 3వ పేజీ తరువాయి

అవకాశం ఉందన్నారు. కానీ ఇప్పటివరకూ దాని జాడ లేదు.

సెయిలింగ్‌కు వస్తే రూ.36 లక్షల ఆదాయం


క్రూయిజ్ నౌక ఒకసారి విశాఖపట్నం పోర్టుకు వస్తే రూ.2 కోట్ల వ్యాపారం జరుగుతుంది. దానిపై రాష్ట్రానికి 9 శాతం, కేంద్రానికి 9 శాతం జీఎస్టీ రూపంలో రూ.36 లక్షల ఆదాయం వస్తుంది. వారానికి నాలుగుసార్లు వస్తే కోటి రూపాయల దాటి ఆదాయం లభిస్తుంది. ఇంత ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పుడు కొన్ని లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి రోడ్ షోలు నిర్వహిస్తే ఫలితం ఉంటుంది. దానికి పోర్టు చొరవ తీసుకోవడం లేదు.

ముందుకువచ్చిన టూర్ ఆపరేటర్లు

రెండేళ్ల క్రితం ఎటువంటి టెర్మినల్ లేకుండానే క్రూయిజ్‌ని తీసుకువచ్చిన టూర్ ఆపరేటర్లు...ప్రస్తుత పరిస్థితిపై ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షులు విజయమోహన్ ఆధ్వర్యంలో పోర్టు అధికారులను కలిసి మాట్లాడారు. దీనిపై మూడు రోజుల క్రితం పోర్టు డిప్యూటీ ఛైర్మన్ దుర్గేశ్‌కుమార్ దూబె, రాష్ట్ర పర్యాటక శాఖ ప్రతినిధి, జిల్లా పర్యాటక శాఖ అధికారిణి జ్ఞానవేణి, తదితరులు క్రూయిజ్‌లను రప్పించడానికి ఎటువంటి చర్యలు చేపట్టాలనే దానిపై చర్చించారు. అంతర్జాతీయ వేదికలపై రోడ్ షోలు నిర్వహించాలని ఆపరేటర్లు ప్రతిపాదించారు. దీనికి ప్రణాళిక సిద్ధం చేసి, ముందుకువెళితే కనీసం ఏడాది తరువాతైనా క్రూయిజ్‌లు వస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. దీనికి అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

ఎంవీవీ కుటుంబ సభ్యుల కిడ్నాప్‌పై పునర్విచారణ చేపట్టాలి

▸ జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్



సీతంపేట, జూన్ 15: మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుటుంబ సభ్యులు, ఆయన అనుచరుడైన జీవీ కిడ్నాప్‌నకు గురై నేటికి ఏడాదవుతున్నా...ఈ కేసు కొలిక్కిరాకపోవడం దారుణమని, దీనిపై పూర్తిస్థాయిలో పునర్విచారణ చేపట్టి నిజానిజాలు తేల్చాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ డిమాండ్ చేశారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కిడ్నాప్ ఎందుకు చేశారన్న దానిపై ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అప్పటి ప్రభుత్వ పెద్దలు, పోలీస్ అధికారులు తొక్కిపెట్టారన్నారు. అప్పటి పోలీసు అధికారులు ఎంవీవీతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. ఈ కేసును తిరిగి మొదటి నుంచి దర్యాప్తు చేపట్టి వాస్తవాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో అరెస్టు అయిన నిందితుడు వెంకట్ ద్వారా రూ. వేలకోట్ల విలువ చేసే వందల ఎకరాల ఆస్తులు, స్థలాల సెటిల్‌మెంట్లు జరిగాయని, అవన్నీ ఎంవీవీ సత్యనారాయణ, జీవీల కోసమే జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. డేగా టీమ్ గ్యాంగ్‌స్టర్స్ ఎవరని, వారితో ఎంవీవీ, జీవీలకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. వీటన్నింటిపై సీబీఐతో విచారణ జరపాలని మూర్తియాదవ్ డిమాండ్ చేశారు.

సీతంపేటలో రోడ్డుపై మురుగునీరు


రాజేంద్రనగర్‌లో మురుగునీరు

సీతంపేట, జూన్ 15: గ్రేటర్ విశాఖ 25వ వార్డు సీతంపేట రాజేంద్రనగర్‌లో కాలువలు చెత్తాచెదారంతో నిండిపోవడంతో మురుగునీరంతా రోడ్డుపై వచ్చి ప్రవహిస్తోంది. దీంతో స్థా నికులు దుర్గంధం భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటికప్పు డు చెత్త తొలగించకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొంటోంది. పాదచారులు నడిచి వెళ్లడానికి కూడా వీలు లేకుండా పోతుందని స్థానికులు వాపోతున్నారు. కాలువల్లో మురుగుతో దోమలు వ్యాప్తి చెంది రా త్రివేళల్లో ని ద్ర కరువవుతోందని ఆ వేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి మురుగుకాలువలు శుభ్రం చేసి చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

శివలింగపురం స్టేషన్‌లో డీఆర్ఎం తనిఖీలు


స్టేషన్‌లో పరిశీలిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

విశాఖపట్నం, జూన్ 15: కొత్తవలస-కిరండోల్ లైనులోని శివలింగపురం స్టేషన్‌లో డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ శనివారం తనిఖీలు చేశారు. డబ్లింగ్ పనులు, సొరంగాలు, మలుపులు, పాయింట్లు, క్రాసింగ్‌లతోపాటు వంతెన నిర్వహణ కార్యకలాపాలను పరిశీలించారు. అలాగే, ట్రాక్షన్, సబ్ స్టేషన్లతోపాటు నీటి పరీవాహక ప్రాంతాలలో చేపడుతున్న భద్రత చర్యలను తనిఖీ చేశారు. భద్రతా ప్రమాణాలను పాటించాలని సిబ్బందికి సూచించారు. ఈ పర్యటనలో ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్ గుప్తా, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గాలివానకు నేలకొరిగిన చెట్లు


శాంతిపురంలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

సీతంపేట, జూన్ 15: సీతంపేట శంకరమఠం రోడ్డు శాంతిపురంలో శనివారం సాయం త్రం పడిన ఈదురుగాలులతో కూడిన వర్షానికి పెద్ద చెట్టు నెలకొరిగింది. అయితే ఆ సమయంలో అటుగా ఎవరు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికుల దారికి అడ్డు లేకుండా చెట్టు కొమ్మలకు తొలగించారు.

విశాఖపట్నం: ఈదురుగాలులకు నగరంలోని పలు ప్రాంతాలలో చెట్లు, ఎన్నికల ప్రచార బ్యానర్లు ఎగిరిపోయాయి. ద్వారకానగర్ రోడ్‌లో బాయ్ లండన్ దుకాణం ఫుత్‌పాత్‌పై రహదారి పక్కనున్న ఒక చెట్టు కూలి వైర్లపై పడింది. దీంతో గురుద్వారా, సీతంపేట వైపు నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు వచ్చే వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. అలాగే, ద్వారకానగర్ బుధిల్‌పార్క్ సమీపంలో మరో చెట్టు కూలిపోయింది.



స్వామివారికి తులసీ దళార్చన,

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, జూన్ 15 : వరాహలక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జిత సేవలను శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు జరిపి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం ఆగమోక్తముగా కల్యాణ క్రతువు నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూరనీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

పంపిణీకి సిద్ధంగా స్టూడెంట్ కానుకలు



పంపిణీకి సిద్ధంగా ఉన్న పాఠ్య పుస్తకాలు, కిట్లు

ఆనందపురం, జూన్ 15 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు త్వరలోనే స్టూడెంట్ కానుకలు పంపిణీ చేయనున్నట్టు ఎంఈఓ గంగరాజు తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు 4734 మంది చదువుతున్నారని, అన్ని తరగతుల పుస్తకాలు మండల విద్యా వనరుల కేంద్రానికి చేరాయన్నారు. విద్యార్థులకు సరిపడ బ్యాగులు, బూట్లు, కూడా వచ్చాయన్నారు.

శిథిలావస్థలో డ్రైనేజీ



ఇందిరానగర్ రోడ్డు కాలువలో నిలిచిపోయిన మురుగు

ఆరిలోవ, జూన్ 15 : పాతడెయిరీ ఫారానికి సమీపంలోని ఆదర్శనగర్ పెట్రోలు బంక్ రోడ్డులో డ్రైనేజీ శిథిలం కావడంతో మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. దీనికి తోడు చెత్త పేరుకుపోయి, పక్కనున్న మట్టి జారిపోవడంతో కాలువలో మురుగు నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతోంది. దీంతో అటువైపుగా రాకపోకలు చేసేవారు దుర్వాసనకు ఇబ్బంది పడుతున్నారు. అలాగే దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని భయపడుతున్నారు. జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి కాలువ పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

'అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలి'

ఆనందపురం, జూన్ 15 : మండలంలోని వేములవలస కూడలిలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని తర్లువాడ గ్రామానికి చెందిన స్వచ్ఛంద సేవకుడు కోరాడ ఆదినారాయణ కోరారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలో 26 పంచాయతీలు ఉండగా విద్యాపరంగా వేములవలస కూడలే కేంద్రం కావడంతో రైతులు, నిరుపేద కూలీలు ఇక్కడికి వస్తుంటారని చెప్పారు. అలాగే ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఆనందపురం మార్కెట్‌కు పదుల సంఖ్యలో కొనుగోలుదారులు, వ్యాపారులు వస్తుంటారన్నారు. ఈనేపథ్యంలో స్థానికంగా అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తే రైతులు, కూలీలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

సినిమా గైడ్

- **మహరాజ :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)
- **మ్యూజిక్ షాపు మూర్తి:** రమాదేవి, విశేష్ (గాజువాక)
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **సత్యభామ :** సంగం, శ్రీకన్య (గాజువాక)
- **గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి :** వెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **గం గం గణేశా :** వెంకటేశ్వర, శ్రీకన్య (గాజువాక)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35,టమాటా 50, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 40, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 48, బీరకాయలు 48, ఆనపకాయలు 28, కాలీఫ్లవర్ 40, క్యాబేజ్ 24, క్యారేట్ 32, దొండకాయలు 34, బంగాళా దుంపలు 34, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 64, అల్లం (పాతది) 170, బరబటి 64, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోస కాయలు 22, వె ల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 140, పొటల్స్ 38, కీరదోస 30, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 42, కంద 60, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 128
ఫారం ధర	-- 148
విత్ స్కిన్	-- 266
స్కిన్‌లెస్	-- 276

మరికొన్ని సిటీ వార్తలు పేజీ III లో..

చదువుతోనే యువతకు భవిత

- ఎంపీ ఎం.శ్రీభరత్
- విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

వెంకోజీపాలెం, జూన్ 15 : యువత దేశ, రాష్ట్ర అభివృద్ధికి కీలకమని, చదువుతోనే అది సాధ్యపడుతుందని ఎంపీ ఎం. శ్రీభరత్ అన్నారు. శనివారం ఆయన వెంకోజీపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎతిహాద్ ముస్లిం కమ్యూనిటీ వెల్ఫేర్ సొసైటీ (ఈఎంసీ) ఆధ్వర్యంలో ముస్లిం విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడ పిల్లలను చదివిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. పిల్లల ఉన్నత భవిష్యత్తుకు వారు ఎంచుకున్న రంగంలో ప్రోత్సహించాలని సూచించారు. పేద ముస్లిం విద్యార్థులను ప్రోత్సహించే దిశగా ఏటా ఉపకార వేతనాలు అందిస్తున్న ఎతిహాద్ ముస్లిం కమ్యూనిటీ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధుల సేవలను కొనియాడారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ పేదరికాన్ని జయించాలన్నా.. ఉన్నత స్థానం సాధించాలన్నా.. చదువుతోనే సాధ్యపడుతుందన్నారు. సొసైటీ అధ్యక్షుడు ఐహెచ్ ఫరూక్ మాట్లాడుతూ సొసైటీ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. గత ఏడాది ఒక్కొక్క విద్యార్థికి పది వేల రూపాయల చొప్పున 118 మందికి అందించగా, ఈఏడాది 130 మంది విద్యార్థులకు ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి జాఫర్ హుస్సేన్, కోశాధికారి రియాజ్ ఖాన్ పాల్గొన్నారు.



వైసీపీ బ్యానర్లు తొలగిస్తున్న టీడీపీ నాయకులు

సచివాలయాలపై వైసీపీ బ్యానర్లు తొలగింపు

మద్దిలపాలెం, జూన్ 15 : జీవీఎంసీ 22వ వార్డులో సచివాలయాలకు వైసీపీ రంగులతో ఏర్పాటు చేసిన బ్యానర్లను స్థానిక టీడీపీ నాయకులు శనివారం తొలగించారు. వార్డులోని సచివాలయాలకు నీలి రంగు బ్యానర్లపై జగన్ ఫొటో ప్రింట్ చేసి ఏర్పాటు చేశారు. వీటిపై టీడీపీ నాయకులు గతంలో సచివాలయం సిబ్బందిని ప్రశ్నించినా ఫలితం లేకపోయింది. కూటమి అధికారంలోకి రావడంతో టీడీపీ నాయకుడు బొట్టా వెంకటరమణ నేతృత్వంలో కార్యకర్తలు వైసీపీ రంగుల బ్యానర్లు తొలగించారు. అలాగే కేబుల్ ఇనుప స్తంభాలకు వేసిన నీలి రంగును కూడా తొలగించి కొత్త రంగులు వేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు డొక్కర శ్రీనివాసరావు, కోడిబోయిన ఆనంద్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

చేపల వేట మొదలు



నాగమయ్యపాలెంలో వేటకు వలలను సిద్ధం చేస్తున్న మత్స్యకారులు

భీమునిపట్నం (రూరల్), జూన్ 15 : మండలంలో రెండు నెలల విరామం తర్వాత శనివారం నుంచి సముద్రంలో చేపల వేట మొదలైంది. ఇక్కడ 16 గ్రామాలకు చెందిన నాలుగు వేల మంది మత్స్యకారులు చేపల వేట ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం రెండు నెలలు చేపల వేటకు విరామం ప్రకటించడంతో ఎటువంటి ఉపాధి లేకుండా ఉండిపోయారు. ప్రస్తుతం చేపల వేట విరామం ముగియడంతో నాగమయ్యపాలెం, అన్నవరం, మూలకుద్దు తదితర ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు పడవలు, వలలను సిద్ధం చేసుకుంటున్నారు. సముద్రంలోకి వేటకు వెళితే వారం, పది రోజులు తరువాత ఇళ్లకు చేరుకుంటారు.

నేటి నుంచి పద్మనాభంలో దుర్గాలమ్మ పండగ



పద్మనాభం, జూన్ 15 : పద్మనాభంలో ఆదివారం నుంచి దుర్గాలమ్మ పండగ జరగనుంది. ఈమేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ఆలయ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. అమ్మవారిని ఊరేగించే సతకంపట్టు నుంచి చదురుగుడి వరకు మురుగు కాలువలను జేసీబీలతో పరిశుభ్రం చేశారు.ఆలయానికి రంగులు వేయడంతో పాటు ఉత్సవంలో భాగంగా ఊరేగించే రథాన్ని కూడా సిద్ధం చేశారు. దేవర ఉత్సవంతో ప్రారంభమయ్యే పండగ 17న తొలేళ్ల ఉత్సవం, 18న అనుపోత్సవం, 19న కనుమతో ముగియనుంది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

'విద్యా దృక్పథాలు' పుస్తకావిష్కరణ

వెంకోజీపాలెం, జూన్ 15 : ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ ప్రచురించిన విద్యా దృక్పథాలు పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ, టెట్ తదితర పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ పుస్తకానికి ఏయూ విద్యా విభాగాధిపతి డాక్టర్ షారోన్ రాజు చీఫ్ ఎడిటర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్, అకడమిక్ డీన్ ఆచార్య ఎన్. కిషోర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు. కాగా ఏయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆచార్యులు, అకడమిక్ డీన్ ఆచార్య ఎన్. కిషోర్‌బాబు, ఏయూ పరిశోధక విద్యార్థి టి. యశ్వంత్‌కుమార్ సంయుక్తంగా రచించిన ఫండమెంటల్స్ ఆఫ్ రిటైల్ మేనేజ్‌మెంట్ పుస్తకాన్ని కూడా వీసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన పుస్తక రచయితలను అభినందించారు.

ఎంపీ శ్రీభరత్‌ను కలిసిన వంశీకృష్ణ



ఎంవీపీ కాలనీ, జూన్ 15 : ఎంవీపీ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో శ్రీభరత్‌ను దక్షిణ నియోజకవర్గం నుంచి జనసేన తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికైన వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన శ్రీభరత్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు. అలాగే శ్రీభరత్ కూడా వంశీకృష్ణను అభినందించారు.

సంపత్ వినాయగర్ ఆలయం హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సిరిపురం, జూన్ 15 : సిరిపురంలోని సంపత్ వినాయగర్ దేవాలయం హుండీ లెక్కింపు శనివారం చేపట్టారు. 28 రోజులకుగాను రూ.18,28,509 లక్షల నగదు, 228 గ్రాముల వెండి, యూఎస్ఏ డాలర్లు 27, సింగపూర్ డాలర్లు 20, థాయిలాండ్ భట్ 20, మలేషియా రింగిట్ 6 వచ్చినట్టు ఈవో శిరీష తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళర్, శివజ్యోతి, శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారులు జీవీ రాంబాబు, దేవాలయ సిబ్బంది డీఎస్ ప్రసాద్, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

నేడు హోమియో వైద్య శిబిరం

భీమునిపట్నం, జూన్ 15 : పట్టణంలోని కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ ఛైర్మన్ కె. శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఉదయం 9.30 గంటలకు చిన్నబజారు డచ్ రోడ్‌లో వున్న సంస్థ కార్యాలయం ఆవరణలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. ఈమేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ఘనంగా రామాలయం వార్షికోత్సవం



ఆలయ వార్షికోత్సవంలో భాగంగా స్వామివారికి భక్తుల పూజలు

పద్మనాభం, జూన్ 15 : మండలంలోని వెంకటాపురంలో రామాలయం వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. అర్చకులు వేకువజామున హనుమాన్ సమేత సీతా రామలక్ష్మణ విగ్రహాలకు పూజలు, అర్చనలు చేశారు. అనంతరం రేవిడి, వెంకటాపురం, అన్నంపేట గ్రామాల నుంచి వచ్చిన భక్తులు సీతా రాములను దర్శించుకొని పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె. రమణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గంగరాజు, పల్లా రాములు, సన్ని పాల్గొన్నారు.

విద్యతోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి

భీమునిపట్నం, జూన్ 15 : విద్యతోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. శనివారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మెగా డీఎస్సీ ప్రకటనతో నిరుద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో అనేక ఉద్యోగ, ఉపాధి లభిస్తాయని చెప్పారు.

నిత్యావసర సరకులు అందజేత

భీమునిపట్నం రూరల్, జూన్ 15 : తగరపువలసలోని సత్యనారాయణపేటకు చెందిన బుడుమూరి జయ శంకర్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై మంచానికే పరిమితమయ్యాడు. ఈ విషయాన్ని సామాజిక కార్యకర్త వెంపాడ శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సతీమణి శారద దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె గంటా శారద హెల్పింగ్ హేండ్స్ సంస్థ ద్వారా బాధిత కుటుంబానికి శనివారం నిత్యావసర సరకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంపాడ శ్రీనివాస్‌రెడ్డి, గిడుతూరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పెదగదిలి బీఆర్‌టీఎస్ రోడ్డులో నిలిచిన నీరు



పెదగదిలి బీఆర్‌టీఎస్ రోడ్డులో చేరిన వర్షం నీరు

ఆరిలోవ, జూన్ 15 : పెదగదిలి జంక్షన్, సర్వీసు రోడ్డులో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి భారీ ఎత్తున నీరు నిలిచిపోయింది. సుమారు మూడు అడుగుల మేర నీరు నిలిచిపోవడంతో పాదచారులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. పెదగదిలి కొండవాలు ప్రాంతం నుంచి వర్షం నీరు సర్వీసు రోడ్డులో వచ్చి చేరుతున్నది. అలాగే బీఆర్‌టీఎస్ రోడ్డు లోతట్టు ప్రాంతంలో ఉండడంతో అక్కడ కూడా నీరు నిలిచిపోతున్నది. మేయర్ క్యాంపు కార్యాలయానికి సమీపంలోనే ఈ పరిస్థితి నెలకొన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.

సాగర్‌నగర్ : సాగర్‌నగర్ తీర ప్రాంత గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ ఈదురుగాలులతో వర్షం పడింది. వర్షానికి తోడు ఈదురుగాలులు భారీగా వీయడంతో పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచి ఎండ తీవ్రతతో ఇబ్బంది పడిన ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు.

అభివృద్ధికి నోచుకోని బోట్ క్లబ్

మధురవాడ, జూన్ 15 : మధురవాడ శిల్పారామంలో బోట్ క్లబ్ అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఇక్కడ సుమారు ఆరు ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. గతంలో బోట్ క్లబ్ నిర్వహించేవారు. కాలక్రమంలో చెరువులో నీరు ఎండిపోవడంతో బోట్ క్లబ్‌ను మూసివేశారు. చెరువులో నీరు నింపితే మళ్లీ పూర్వ వైభవం వస్తుంది. హైదరాబాద్ శిల్పారామంలో కూడా రీసైక్లింగ్ వాటర్‌తోనే బోట్ క్లబ్ నిర్వహిస్తున్నారు. అక్కడ పర్యాటకులను బోట్ క్లబ్ విశేషంగా ఆకర్షిస్తోంది. అదే తరహాలో మధురవాడ శిల్పారామంలో కూడా ప్రైవేటు భాగస్వామ్యంతో బోట్ క్లబ్‌ను పునరుద్ధరించాలని పర్యాటకులు కోరుతున్నారు. కాగా గత ప్రభుత్వ హయాంలో శిల్పారామం అభి వృద్ధిపై నీలినీడలు కమ్ముకున్నాయి. కనీస నిర్వహణకు కూడా నిధుల కొరత నెల కొంది. వారాంతపు వినోద కార్యక్రమాల నిర్వహణకు కూడా ఇబ్బందులు ఎదురవడంతో దాతల సహాయంతో గట్టెక్కించారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో స్థానిక నాయకులు శిల్పారామం అభివృద్ధిపై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

నిరుపయోగంగా వాటర్ ప్లాంట్

సింహాచలం, జూన్ 15 : జీవీఎంసీ 98వ వార్డులో ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ సుజల సురక్షిత తాగునీటి పథకాన్ని పునఃప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు. 2015 మార్చి నెలలో రాజవీధిలోని మహిళా భవన్‌లో జీవీఎంసీ నిధులతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అప్పట్లో డ్వాక్రా సంఘాలకు చెందిన ఆర్‌పీ ఈ పథకాన్ని నిర్వహించేవారు. 20 లీటర్ల నీరు రూ. 2లకు విక్రయించడం ద్వారా వచ్చిన సొమ్ముతో ప్లాంట్ నిర్వహణ చూసేవారు. తరువాత విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడం, జీవీఎంసీ అధికారులు అటువైపు కనీసం కన్నెత్తి చూడకపోవడంతో పథకం మూతపడింది. ప్రస్తుతం వార్డులో ప్రైవేటు నిర్వహణలో ఉన్న ప్లాంట్ల నుంచి 20 లీటర్ల నీటిని రూ. 15 నుంచి రూ. 20 వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. అధికారులు తక్షణమే స్పందించి ఎన్‌టీఆర్ సుజల ప్లాంట్‌ను పునఃప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

అంతర్గత రోడ్ల మూసివేతతో అవస్థలు

సింహాచలం, జూన్ 15 : జీవీఎంసీ 98వ వార్డు పాత గోశాల కూడలి నుంచి పాత అడివివరం కూడలి వరకు జరుగుతున్న బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్మాణంలో భాగంగా అధికారులు ప్రధాన రహదారికి వీధులకు అనుసంధానంగా ఉన్న రోడ్లను మూసివేశారు. దీంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కాపువీధి, కుమ్మరివీధి, శిడగంపేట, పోస్టాఫీసు వీధులకు అనుసంధానంగా ఉన్న రోడ్లను మూసివేయడంతో అటువైపు కనీసం ఆటోలు, ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లే పరిస్థితి లేదు. దీనివల్ల వందలాది కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నాయి. ఈ విషయమై స్థానికులు గతంలో జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు కాంట్రాక్టర్లకు కొన్ని సూచనలు చేశారు. కానీ వారు అవేవీ పట్టించుకోకుండా పనులను కొనసాగిస్తున్నారు. కాంట్రాక్టర్ల తీరును నిరసిస్తూ నాలుగు రోజుల క్రితం తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సతివాడ శంకరరావు ఆధ్వర్యంలో కుమ్మరివీధి ప్రాంతానికి చెందిన స్థానికులు ఆందోళన కూడా చేపట్టారు. అనుసంధాన రోడ్లు లేకపోవడంతో వీధుల్లోకి ఆటోలు, అంబులెన్స్‌లు వచ్చే పరిస్థితి లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. గ్రామ దేవతల వార్షిక పండుగలు, అప్పన్న స్వామి తిరువీధి ఉత్సవాల సమయంలోనూ ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని చెబుతున్నారు.

శొంఠ్యాం చెరువు ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆనందపురం, జూన్ 15 : మండలంలోని శొంఠ్యాం పంచాయతీ మిందివానిపాలెంలో చెరువు ఆక్రమణపై సీపీఐ జిల్లా కార్యదర్శి మరపిళ్ల పైడిరాజు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శనివారం ఆయన నగరంలో కలెక్టర్ మల్లికార్జునను కలిసి వినతి పత్రం అందజేశారు. మిందివానిపాలెం సర్వే నెంబరు 319/1లో సుమారు ఎనిమిది ఎకరాలు గెడ్డ వాగు కింద ఉన్న చెరువును రియల్ ఎస్టేట్ వ్యాపారులు కప్పి లే-అవుట్లుగా మార్చారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో నాయకులు, రెవెన్యూ అధికారుల అండతో దర్జాగా కబ్జాకు పాల్పడ్డారన్నారు. చెరువు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

నోట్ పుస్తకాలు పంపిణీ



బాల వికాస్ విద్యార్థులతో సత్యసాయి భజన మండలి సభ్యులు

ఆనందపురం, జూన్ 15 : మండలంలోని సత్యసాయి ఆదర్శ గ్రామం గొట్టిపల్లి ఇంటిగ్రేటెడ్ సేవా మందిరంలో బాల వికాస్ విద్యార్థులకు స్థానిక భజన మండలి సభ్యులు శనివారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. దాతలు మూర్తి, కొట్యాడ లక్ష్మణమూర్తి, బీఎల్ రాజు సమకూర్చిన 200 నోట్ పుస్తకాలను 40 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం రుత్తల సన్యాసిరావు, మాజీ సర్పంచ్ కోరాడ నాయుడుబాబు, సత్యసాయి సేవా సంస్థల విశాఖపట్నం జోనల్ కో-ఆర్డినేటర్ మానాపురం సత్యసాయి కుమార్, ఆదర్శ గ్రామం కో-ఆర్డినేటర్ విజయ్‌కుమార్, భజన మండలి కన్వీనర్ కోరాడ తమ్మునాయుడు పాల్గొన్నారు.

అనంతవరం ఉన్నత పాఠశాలలో...

పద్మనాభం (రూరల్) : విద్యార్థులు బాగా చదివితేనే మంచి భవిష్యత్ ఉంటుందని భీమిలి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గర్రెపాటి పెద ఎర్రినాయుడు అన్నారు. శనివారం ఆయన అనంతవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే విద్యాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వారంలో నాలుగు రోజులు బీసీజీ వ్యాక్సిన్

మధురవాడ, జూన్ 15 : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వారంలో నాలుగు రోజుల పాటు టీబీ నియంత్రణకు బీసీజీ వ్యాక్సిన్లు వేయనున్నట్టు మధురవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి తెలిపారు. శనివారం ఆమె ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. మధురవాడ పీహెచ్‌సీతో పాటు సచివాలయ ఆరోగ్య కేంద్రాల్లో సోమవారం నుంచి గురువారం వరకు వ్యాక్సిన్లు అందుబాటులో ఉంటాయన్నారు. 18 ఏళ్లు నిండినవారు, పొగతాగేవారు, గతంలో టీబీ వ్యాధికి గురై కోలుకున్నవారు, షుగర్ వ్యాధితో బాధ పడుతున్నవారు వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు.

మంత్రి లోకేశ్ నిర్ణయం పట్ల ఉపాధ్యాయుల హర్షం

మధురవాడ, జూన్ 15 : రాష్ట్రంలోని విద్యా వ్యవస్థపై మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ శనివారం ఉండవల్లిలో సమీక్షించి, ఏడాదిలోగా పాఠశాలల్లో పెండింగ్ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నాడు నేడు ఫేజ్-2, ఫేజ్-3 పనులు నత్తనడకన సాగుతున్నాయి, ఈ పనులను ఏడాదిలోగా పూర్తి చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. అలాగే మధ్యాహ్న భోజనం, పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ, డ్రాపౌవుట్లపై వివరాలు, గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిన విద్యార్థుల వివరాలు నివేదిక కోరడంతో ప్రభుత్వ పాఠశాలలకు మళ్లీ మంచి రోజులు వచ్చాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్ విద్యార్థులకు కూడా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు వచ్చేనెల 15లోగా అందించాలని మంత్రి ఆదేశించడంపై ఆయా వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.

జనసేన నాయకుల సంబరాలు



వేడుకల్లో పాల్గొన్న పంచకర్ల సందీప్, శాఖరి శ్రీనివాస్

ఎండాడ/సాగర్‌నగర్, జూన్ 15 : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పర్యావరణం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖా మంత్రిగా పవన్ కల్యాణ్ శనివారం బాధ్యతలు చేపట్టడంతో స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. ఆ పార్టీ 8వ వార్డు అధ్యక్షుడు శాఖరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పెంపుతో దివ్యాంగులకు ఆర్థిక భరోసా

పద్మనాభం (రూరల్), జూన్ 15 : పింఛన్ మొత్తాన్ని రూ. 6 వేలకు పెంచడం వల్ల దివ్యాంగులకు ఆర్థిక భరోసా లభిస్తుందని మాజీ ఎంపీపీ కాళ్ల పద్మ, నగేష్‌కుమార్ దంపతులు అన్నారు. శనివారం వారు ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఐదు ఫైళ్లపై సంతకాలు చేయడం హర్షణీయమన్నారు. వైసీపీ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ , కార్మిక వర్గాల పట్ల వివక్ష చూపిందన్నారు. కూటమి ప్రభుత్వంతో ప్రజలకు మంచి రోజులు వచ్చాయని చెప్పారు.

మహాకవి శ్రీశ్రీకి ప్రజా నాట్య మండలి నివాళి

రామ్‌నగర్, జూన్ 15 : మహాకవి శ్రీశ్రీ వర్ధంతి పురస్కరించుకుని బీచ్ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహం వద్ద ప్రజా నాట్య మండలి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం గాన కచేరీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ రచించిన దేశ భక్తి పాటలను గాయకులు పాడారు. అంతకముందు మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ ఆధ్వర్యంలో పలువురు శ్రీశ్రీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి ఎం. చంటి, అధ్యక్షుడు జి. రమణ, కార్పొరేటర్ బి. గంగారావు, దండు నాగేశ్వరరావు, సాహితీ స్రవంతి, పెంటకోట రామారావు, గోపాలరావు, స్టాలిన్, తదితరులు పాల్గొన్నారు.